ప్రజాశక్తి

సూర్జిత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉగాదీ పాయె...ఇంకెప్పుడు..?

- జగనన్న కాలనీల గృహ ప్రవేశాల్లో వాయిదాల పర్వం - నిర్మాణాలు పూర్తి కాకపోవడమే కారణం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇప్పటికే పలు దఫాలు వాయిదా పడిన జగనన్న కాలనీల గృహ ప్రవేశం మరోసారి వాయిదా పడింది. ఉగాదికి సొంతింటిలో చేరాలని భావించిన పేదలకు మళ్లీ నిరాశ ఎదురైంది. మొదట గత ఏడాది డిసెంబరు అన్నారు. ఆ తర్వాత సంక్రాంతికి ఉండొచ్చన్నారు. తరువాత ఉగాదికి అన్నారు. ఇప్పుడు ఉగాది కూడా దాటిపోవడంతో గృహ ప్రవేశాలు ఇంకెప్పుడు అన్న సందేహం వ్యక్తం అవుతోంది...

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్ల స్థలాలను పంపిణీ చేసింది. గృహ నిర్మాణాలకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందిస్తోంది. జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. గతేడాది జూన్‌లో శంకుస్థాపన వారోత్సవాలు నిర్వహించారు. లబ్ధిదారులతో భూమిపూజ కూడా చేయించారు. ఆ కాలనీలలోని ఇళ్ల గృహ ప్రవేశాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత గతేడాది డిసెంబర్ చివర్లో గృహ ప్రవేశం ఉంటుందని అన్నారు. తరువాత సంక్రాంతికి మార్చాయి. ఇప్పుడు సంక్రాంతి కూడా పోవడంతో ఉగాదికి గృహ ప్రవేశాలు చేయించాలని భావించారు. అప్పటికి కూడా కాకపోవడంతో ఉగాదికి గృహ ప్రవేశాలు చేయాలని నిర్ణయించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో మళ్లీ గృహ ప్రవేశాల కార్యక్రమం వాయిదా పడింది. క్షేత్ర స్థాయిలో వాలంటీర్ల నుంచి సిబ్బంది, అధికారులు అందరూ లబ్ధిదారులపై ఒత్తిడి తెచ్చినా వారు ముందుకు కదలలేదు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 48,349 మందికి ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు.

పత్తికొండలో పునాదుల దశలోని జగనన్న కాలనీలోని ఇళ్లు

వాటిలో ఇప్పటి వరకూ 43,699 గ్రౌండింగ్ అయ్యాయి. అయితే వాటిలో 10,820 ఇళ్లు మాత్రమే పునాది స్థాయి, పునాది కంటే పై స్థాయికి చేరాయి. మిగిలిన వన్నీ పునాది స్థాయిలోపే ఉన్నాయి. 4,852 ఇళ్లు అసలు ప్రారంభమే కాలేదు. ఇప్పటి వరకూ 1,271 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. గ్రౌండింగ్ అయిన ఇళ్లలో 2.90 శాతం ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. 2,494 మంది లబ్ధిదారులు తాము ఇళ్లు నిర్మించికోలేమని తేల్చి చెప్పేశారు. ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80లక్షలనే రాష్ట్ర ప్రభుత్వం ఈ జగనన్న కాలనీ లబ్ధిదారులకు అందిస్తోంది. బయట మార్కెట్‌లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నిర్మాణ సామాగ్రి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో ఇళ్లను నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. డబ్బులున్న వారు మాత్రమే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారుల ఒత్తిడితో మరికొందరు వడ్డీలకు అప్పులు తెచ్చి, బంగారు తాకట్టు పెట్టి ఇళ్లను నిర్మించుకుంటున్నారు.

మౌలిక సదుపాయాలూ కరువే..

ఇంటి పట్టాలు ఇచ్చిన ప్రాంతాలు నివాసయోగ్యంగా లేకపోవడంతో లబ్ధిదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. కర్నూలు నగరంలో ఇప్పటికే పేదలకు పట్టాలిచ్చిన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించలేదు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13 వేల మందికి 2007లో ఇందిరమ్మ ఇళ్లు ఫేజ్-2 కింద జగన్నాథగట్టు వద్ద పట్టాలిచ్చారు. అప్పట్లో సిపిఎం ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్ చొరవతో ఇందిరమ్మ ఇళ్లు ఫేజ్-3 కింద 2008లో పందిపాడు వద్ద 52 ఎకరాలను కొనుగోలు చేసి 2500 మంది లబ్ధిదారులకు ఇచ్చారు. ఆ రెండు ప్రాంతాల్లో ఇప్పటి వరకూ ప్రభుత్వం విద్యుత్, నీరు, రోడ్లు వంటి ఎటువంటి మౌలిక వసతులూ కల్పించలేదు. దీంతో 10 శాతం లబ్ధిదారులు కూడా ఆ ప్రాంతాల్లో గృహాలను నిర్మించుకోలేదు. దీనికి తోడు ఒరిజినల్ పట్టాలు హౌసింగ్ కార్పొరేషన్ దగ్గర ఉండిపోవడంతో వారికి ఆ స్థలాలపై పూర్తి హక్కులు కూడా లేకుండా పోయాయి. తరువాత వచ్చిన టిడిపి ప్రభుత్వం వాటిపైన దృష్టి సారించలేదు. ఇప్పుడున్న వైసిపి ప్రభుత్వం కూడా ఆ ప్రాంతాల వైపు చూడకపోవడంతో లబ్ధిదారులు రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం నగరానికి 15 కిలోమీటర్ల దూరంలోని రుద్రవరంలో పట్టాల్విడం పట్ల కూడా లబ్ధిదారుల నుంచి అసహనం వ్యక్తమవుతోంది.

సంకీర్ణ ప్రభుత్వాల ప్రదాత...

హరి కిషన్ సింగ్ సూర్జిత్...

- సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దేశంలో నేడు సంకీర్ణ ప్రభుత్వాల పరంపర కొనసాగుతుందంటే దానికి హరి కిషన్ సింగ్ సూర్జిత్ ఆలోచనలే ప్రధామని సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఎస్ఎ.సుభాన్, రాజగోపాల్ లు అన్నారు. పాతబస్తీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్లో గురువారం ఆయన 108వ జయంతిని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ముహమ్మద్ షరీఫ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని (కాంగ్రెస్ యేతర ప్రభుత్వాలను, బిజెపి యేతర ప్రభుత్వాలను) సంకీర్ణ ప్రభుత్వాల ప్రధాతగా హరికిషన్ సింగ్ సుర్జీత్ చరిత్ర కెక్కారని, స్వాతంత్రపోరాటానికి ఆకర్షితుడై గాంధీజీ ఇచ్చిన పిలుపును అందుకొని, ఆనాటి బ్రిటిష్ పాలకుల కార్యాలయాల పైన 14 యేళ్లకే బ్రిటిష్ వారి జెండాను దించి మన జెండాను ఎగరవేసిన ఘనత సూర్జిత్‌దని అన్నారు.

బ్రిటీష్ పోలీసులు తుపాకులు ఎక్కు పెట్టుకుని ఉన్న కూడా ఏమాత్రం భయపడకుండా, తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి బ్రిటిష్ కార్యాలయం పై జెండా ఎగరేశారని కొరియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు ఎప్పటికప్పుడు ఎండగడుతూ భారతదేశంలో రాజకీయ సంక్షోభం రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో హరి కిషన్ సింగ్ సూర్జిత్ పాత్ర ఎనలేనిదని అన్నారు. యుపిఎ వన్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి, ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని బిజెపిని అధికారంలో కి రాకుండా నివారించిన ఘన చరిత్ర ఆయనదని అన్నారు. అటువంటి మహనీయుని ఆశయ సాధన కోసం మనమందరం కంకణ బద్ధులమై పనిచేయాలని కోరారు. మతోన్మాద ఆర్ఎస్ఎస్, బిజెపి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలను, వామపక్షాలను, లౌకిక వాదులను, రాజ్యాంగ పరిరక్షకులను కలుపుకొని రాబోయే కాలంలో మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాలన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా నికరంగా పోరాటం చేయడమే హరి కిషన్ సింగ్ సుర్జిత్‌కు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్, సిపిఎం సీనియర్ నాయకులు డి.పార్వతయ్య, పి. ఇక్బాల్ హుస్సేన్ , డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ నగర నాయకులు ఇంతియాజ్, వెంకన్న, గౌస్, ఖలీల్ పాల్గొన్నారు.

భారత విప్లవ కెరటం భగత్ సింగ్...

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని సుర్జిత్ భవన్‌లో మాజీ డివైఎఫ్ఐ నాయకులు షరీఫ్ అధ్యక్షతన భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో 23 సంవత్సరాలకే నవ్వుతూ ఉరికంబాన్ని ముద్దాడిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ చనిపోయి 92 సంవత్సరాలు పూర్తయినా నేటికీ భగత్ సింగ్ వారి బందం ఆదర్శంగా నిలిచిందన్నారు. వాడవాడలా వీధి వీధిలో గ్రామ గ్రామాన భగత్ సింగ్‌ను ఆయన ఆశయాలను స్మరించుకుంటున్నారని తెలిపారు. 1907వ సంవత్సరం అక్టోబర్ 9న బంగా గ్రామం లయల్ జిల్లాలో జన్మించిన భగత్ సింగ్ 1931 మార్చి 23న లాహోర్ కర్మాగారంలో సామ్రాజ్యవాద బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసిందని తెలిపారు. గదర్ ఉద్యమ నాయకుల స్ఫూర్తితో మొదట భగత్ సింగ్ ఉద్యమాల్లోకి వచ్చారని తెలిపారు. నాడు వ్యాపారం కోసం వచ్చి బ్రిటిష్ వారు భారతదేశాన్ని భారతదేశంలోని సంపదను దోచుకుపోయారని తెలిపారు. భారతదేశంలో స్వాతంత్ర ఉద్యమాన్ని మత ఉన్మాదం వైపు జాతీయవాదం వైపు కొందరు తీసుకెళుతుంటే భారతదేశానికి రాజకీయ స్వాతంత్రంతో పాటు ఆర్థిక స్వాతంత్రం కూడా రావాలని అది రావాలి అంటే సోషలిజమే సరైన మార్గమని భగత్ సింగ్ బృందం హిందుస్థాన్ రిపబ్లికన్ ఆర్మీని హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ ఆర్మీగా మార్చారని తెలిపారు. వారి స్ఫూర్తితో పోరాడి భారతదేశంలో పేదరికాన్ని రూపుమాపడానికి, నిరుద్యోగంలోని భారతదేశాన్ని నిర్మించుకోవడానికి, అందరికీ విద్యా వైద్యం అందరికీ ఇల్లు ఉపాధి కల్పించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఇంతియాజ్, గౌస్, మధు ఖలీల్ ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, మాజీ డివైఎఫ్ఐ నాయకులు అబ్దుల్ దేశాయ్, రాజగోపాల్, పార్వతయ్య, సి.రవి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు క్రైం : అమరవీరుల ఆశయ సాధన కోసం పోరాడుదామని యువతకు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ కోరారు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు 92వ వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన షెటిల్ టోర్నమెంట్ ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్ కు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడారు. భారతదేశ స్వాతంత్రం కోసం భారతదేశన్ని బ్రిటిష్ ప్రభుత్వం నుండి విముక్తి చేయడం కోసం 23 సంవత్సరాల వయస్సులో ఉరికంబాన్ని ముద్దాడిన విప్లవ వీరులు భగత్ సింగ్ సుఖదేవ్ రాజ్ గురు లు అని అన్నారు. స్వాతంత్రం అంటే బ్రిటిష్ ప్రభుత్వం నుండి భారత ప్రభుత్వం లోకి మారడం కాదని, సంపూర్ణమైన స్వాతంత్రం కావాలని పోరాడిన నాయకులు వారని అన్నారు. స్వాతంత్రం అనంతరం భారత ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి ఉండడానికి ఇల్లు, కట్టుకోవడానికి బట్టలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉండాలని కలలు కన్నారని అన్నారు. నేటికీ భారతదేశంలో చదువు, వైద్యం అందని వారు, కూడు, గూడు లేని కోట్లాదిమంది ఉన్నారన్నారు. డిగ్రీలు, పీజీలు, పీహెచ్డీలు చేసిన కోట్లాదిమంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ప్రకాష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అంజి, డివైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి కిషన్, డివైఎఫ్ఐ గ్రామ నాయకులు రాము, శ్రీను, శివా, రఘువరన్, జగదీష్, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి : బాలపీర

దేశ స్వాతంత్ర్యం కోసం చిరునవ్వుతో ఉరికంబాన్ని ముద్దాడిన అమరవీరులు భగత్ సింగ్ రాజు గురు సుఖదేవుల ఆశయాల సాధన కోసం కృషి చేయాలని ఈ తాండ్రపాడు సర్పంచి బాలపీర అన్నారు. భగత్ సింగ్ వర్ధంతి అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని ఈ తాండ్రపాడు జిల్లా పరిషత్ హై స్కూల్లో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దేశంలో కుల, మత, ప్రాంత బేధాలు లేని నవ సమాజ నిర్మాణం కోసం భగత్ సింగ్ పాటుపడ్డారన్నారు. ఈ నేపథ్యంలో బ్రిటిష్ బానిస సంఖ్యలను తెంచి వేసేందుకు తన ప్రాణాలను తృణప్రాయంగా దేశం కోసం అర్పించారన్నారు. అలాంటి నవ సమాజ నిర్మాణం కోసం యువత విద్యార్థులు నడుం బిగించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ : స్వాతంత్ర సమరయోధులు విప్లవ వీరులు భగత్ సింగ్ ,సుఖ్ దేవ్ ,రాజ్ గురు లకు సిల్వర్ జూబ్లీ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు ఘనంగా నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బివి సుబ్రహ్మణ్య కుమార్ మాట్లాడుతూ భగసింగ్ లాంటి మహనీయుల చరిత్రను తప్పనిసరిగా విద్యార్థులు అధ్యయనం చేయాలన్నారు. నేటి యువతరానికి వారు స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి : భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకంలో చేర్చాలని ప్రజాసంఘాల నేతలు కోరారు.స్వాతంత్ర సమర యోధుడు భగత్ సింగ్ 92వ వర్ధంతిని నగరంలోని బి క్యాంపు బాలికల వసతి గృహంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యం లో నిర్వహించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ నేటి విద్యార్థి, యువతకు భగత్ సింగ్ పోరాట జీవితం స్ఫూర్తిదాయక మని అన్నారు.

ఉల్చాల గ్రామంలో నివాళులర్పిస్తున్న నాయకులు

కర్నూలులో...

సిల్వర్ జూబ్లీ కళాశాలలో...

ఈ.తాండ్రపాడులో గ్రామంలో...

సరిహద్దు రాళ్ల ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఏప్రిల్ 30 వ తేది నాటికి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసే ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రీసర్వే అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కొన్ని జిల్లాల్లో ఇంకా పెండింగ్ లో ఉన్న రెండవ దశ గ్రామాల గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను మార్చి 31 లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.. ఇంకా పెండింగులో ఉన్న ఫైనల్ ఆర్ఓఆర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ గత వీడియో కాన్ఫరెన్స్ లో చెప్పిన విధంగానే వెబ్ ల్యాండ్ నుండి వెబ్ ల్యాండ్ 2.0కి పోర్టింగ్ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేసే ప్రక్రియకి సంబంధించి 73,000 సరిహద్దు రాళ్లు వచ్చాయన్నారు. అందులో 47 గ్రామాల్లో 11,500 సరిహద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మిగిలిన గ్రామాల్లో కొనసాగుతుందని, వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని సిసిఎల్ఏకు జిల్లా కలెక్టర్ వివరించారు. డ్రోన్ ఫ్లైయింగ్‌కు సంబంధించి 472 గ్రామాలకు గాను 166 గ్రామాల్లో పూర్తి చేశామని 68 గ్రామాలకు సంబంధించిన ఓఆర్ఐ లు కూడా వచ్చాయని, ఫైనల్ ఆర్ఓఆర్‌లు కూడా ఇచ్చామని తెలిపారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేసే ప్రక్రియ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి చేయాలని, అదే విధంగా డ్రోన్ ఫ్లైయింగ్ కూడా త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ ఎడి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు...

జర్నలిస్టులపై దేశద్రోహం చట్టాలను ఆపాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వాలు చేసే అవినీతి, అక్రమాలను ఎత్తిచూపితే జర్నలిస్టులపై ఉప, దేశద్రోహం లాంటి చట్టాలను ప్రయోగించడం ఆపేయాలని ఐజెయు జాతీయ సమితి సభ్యులు కొండప్ప, కె.నాగరాజు ఎపిడబ్ల్యుజె జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్‌వి.సుబ్బయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇఎన్.రాజు, శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి సి.రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి శివరాజ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం సేవ్ జర్నలిజం డే కార్యక్రమానికి ఐజెయు పిలుపు ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో కొండారెడ్డి బురుజు నుంచి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టులు ఎబిఎన్ సుంకన్న, మల్లికార్జున ఎపియుడబ్ల్యుజె జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి, మధు, నాయకులు దిశా పేపర్ బ్యూరో నాగేశ్వరరావు, వీడియో జర్నలిస్టు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దేవిరెడ్డి సేవలు మరువలేనివి : ఎపిడబ్ల్యుజెఎఫ్

సీనియర్ జర్నలిస్ట్ ,ఎపి ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి సేవలు మరువలేనివాని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి జిల్లా అధ్యక్షులు కెబి.శ్రీనివాసులు ,జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోరంట్లప్ప,ఫోటో జర్నలిస్ట్ యూనియన్ గౌరవాధ్యక్షులు డి.హుస్సేన్, ఎపి డబ్ల్యుజెఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చిన్న రామాంజనేయులు, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి శివ కుమార్, నాగేంద్ర జిల్లా నాయకులు చంద్రమోహన్ లు ఒక ప్రకటనలో తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. నాలుగు శతాబ్దాలకు పైగా జర్నలిస్టుగా ఇండియన్ ఎక్స్ ప్రెస్ , సాక్షి తదితర పత్రికల్లో ఉన్నత పదవుల్లో జర్నలిస్టుగా పనిచేసిన శ్రీనాథ్ రెడ్డి మరణం చాలా బాధాకరమని, యువ జర్నలిస్టులకు ఎంతో నష్టం అన్నారు. ఎందరో యువ జర్నలిస్టులను రూపుదిద్దడంలో ప్రోత్సహించడంలో ఆయన కృషి ప్రశంసనీయం అని కొనియాడారు.

కల్లూరులో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పాత కల్లూరులో ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వ హించారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు గౌరు వెంకట రెడ్డి, ఏమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుమారుడు కాటసాని శివ నరసింహారెడ్డి దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ సర్పంచి నాగ లక్ష్మయ్య ఎద్దుల బండి ఊరు వాకిలి వద్ద నాభి శిలకు పూజ చేసి చౌడేశ్వరి దేవి ఆలయానికి వచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. తరువాత రైతులు తాళాలు శంకరయ్య, గొల్ల నారాయణలు తమ వృషభ రాజములతో అమ్మవారి ఆలయ ప్రదక్షణలు చేశారు. ఆలయ చైర్మన్ పోలిశెట్టి వేంకటేశ్వర్లు, కార్పొరేటర్లు మైతాపు నరసిం హులు, సాన శ్రీనివాసులు, శ్వేతారెడ్డి, నారాయనరెడ్డి, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ ఎన్‌వి. రామకృష్ణ, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి, పవన్ కుమార్, గోపి, అల్లిపీర, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది సంబరాల్లో రజకులు

కర్నూలు కార్పొరేషన్ : బళ్లారి రోడ్డు 42వ వార్డు తిలక్ నగర్ రజక వృత్తిదారులు ఉగాది సంబరాలలో భాగంగా కల్లూరులో ఉండే చౌడేశ్వరి మాత గుడి దగ్గరకు గాడిద బండితో ఊరేగింపుగా వెళ్లారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి, అధ్యక్షుడు రాముడు, రజక వృత్తిదారుల సంఘం నగర కమిటీ సభ్యులు సురేష్, రమేష్ బాబు, మధు, తిలక్ నగర్ రజక వృత్తిదారులు పద్మ పాల్గొన్నారు.

జాతీయ మహిళ కబడ్డీ పోటీలు ప్రారంభం

మహిళలు అన్ని రంగాలలో ముందుండాలి

పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి-తుగ్గలి : కర్నూలు జిల్లా తుగ్గలి మండలం కడంకుంట్ల గ్రామంలో చౌడేశ్వరి దేవి ఉత్సవాల సందర్భంగా నిర్వాహక చైర్మన్ అమర్నాథ్ రెడ్డి ఏర్పాటు చేసిన జాతీయ మహిళా కబడ్డీ పోటీలను పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ మహిళా కబడ్డీ పో టీలకు వివిధ ప్రాంతాలకు చెందిన మహి ళలు హాజ రయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ముందుం డాలని ఆమె కోరారు. మహిళా కబడ్డీ పోటీలు పెట్టడం అరుదని ప్రస్తుతం కడమకుంటలో నిర్వాహక చైర్మన్ అమర్నాథ్ రెడ్డి ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. గతంలో క్రీడా పోటీలను చూడాలంటే దూరప్రాంతాలకు వెళ్లే వారమని, ప్రస్తుతం అన్ని గ్రామాలలో పండుగలకు ఏర్పాటు చేస్తుండటం హర్షించదగ్గ విషమని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ కబడ్డీ పోటీలు నిర్వాహక కమిటీ చైర్మన్ ఊటకంటి అమర్నాథ్ రెడ్డి, జడ్పిటిసి పులికొండ నాయక్ ,వైసిపి సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, తుగ్గలి మోహన్ రెడ్డి, నగేష్ యాదవ్, తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి, అట్లా గోపాల్ రెడ్డి, సచివాలయం మండల కన్వీనర్ ఆర్. హనుమంతు, మాజీ సర్పంచి ఊటకంటి సునీత, కలచట్లు మధు యాదవ్, గుంతా రాఘవేంద్ర, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

మహిళా కబడ్డి క్రీడాకారులతో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

శ్రీకృష్ణ కమలపాలిక కళాకారులకు ఘనసన్మానం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

తెలంగా ణలోని మిర్యాల గూడలో జరిగిన జాతీయ స్థాయి నాటక పో టీలలో కర్నూలు కళాకారులు తమసత్తాచాటారు. ప్రథమ బహుమతి సాధించి కర్నూలు నాటకరంగానికి తిరు గులేదని నిరూపించుకున్నారు. మార్చి 10 నుండి 20 వరకు జరిగిన తెలంగాణ సాంస్కృతిక శాఖ , మిర్యాలగూడ సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ పద్యనాటకపోటీలలో కర్నూలు టిజివి కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన శ్రీకృష్ణకమలపాలిక నాటకం ప్రథమ బహుమతి సాధించడంతో సదరు కళాకారులను ఉగాది ఉత్సవాల్లో ఘనంగా సత్కరించారు. సభాధ్యక్షులు పత్తిఓబులయ్య నేతృత్వంలో కళాకారుల కుటుంబాలను సత్కరించారు. ఈ నాటకానికి పత్తి ఓబులయ్య దర్శకత్వం వహించగా, పల్లేటి కులశేఖర్ రచన చేశారు. ఈ నాటకం ఉత్తమ నాటకం గానూ ఉత్తమ నటుడుగా జి. శ్రీనివాసరెడ్డి - (శ్రీకష్ణ పాత్ర) ప్రథమ బహుమతి ఉత్తమనటి గా సురభి భారతి కమల పాత్ర ధారి, ఉత్తను హాస్యనటుడుగా సంగా ఆంజనేయులు చిట్టాదార పాత్ర, హసీనా (సింగారి పాత్ర), మహమ్మద్ మియా ఉత్తమ సంగీతంగా బి.బల రాముడు వారి సతీమణులతో కలిపి సత్కరించారు.

కెంగార మోహన్‌ను అభినందిస్తున్న జి.పుల్లయ్య తదితరులు

అలరించిన కవిసమ్మేళనం : ఉగాది సందర్భంగా జరిగిన కవిసమ్మేళనంలో ఆరు మంది కవులు కవితాపఠనం చేశారు. కవితాపఠనం చేసిన వారిలో డాక్టర్ వి.పోతన్న, కల్యాణదుర్గం స్వర్ణలత, కెంగార మోహన్ , డాక్టర్ ఫమీద, జివి.సారథి, ఇనాయతుల్లాలు చేశారు.

అబ్బుర పరచిన నృత్యప్రదర్శనలు : ఉత్సవాల్లో భాగంగా కరీముల్లా నృత్యబృందం చేసిన కళా నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.కళాకారులను పారిశ్రామికవేత్త బివి రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్యలు సన్మానించారు.

వాలంటీర్లకు దరఖాస్తు చేసుకోండి : ఎంపిడిఓ

ప్రజాశక్తి-సి బెళగల్ : మండలంలో కంభదహాల్ లో క్లస్టర్ -5,6 కు బిసి ఉమన్, సి బెళగల్ లో క్లస్టర్ 15,17 కు బిసి ఎ ఉమన్ ఒకరు, మెన్ ఒకరు, గొల్లలదొడ్డిలో క్లస్టర్ 6 కు బిసిఎ ఉమన్, బ్రాహ్మణ దొడ్డిలో క్లస్టర్ 9 కు ఎస్‌సి మెన్ కావాలని ఎంపిడిఓ రాముడు పేర్కొన్నారు. నేడు చివరి రోజు అని ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రాహుల్ గాంధీకి రెండేళ్ళ శిక్షకు ఖండన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసే తప్పులను ఎత్తి చూపితే రాహుల్ గాంధీది తప్పు కాదని అది బావ ప్రకటన స్వేచ్ఛ అని నంద్యాల డిసిసి అధ్యక్షులు జె.లక్ష్మి నరసింహ యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆయన కల్లూరు అర్బన్ నంద్యాల చెక్ పోస్ట్ నందిని దామోదరం సంజీవయ్య భవన్లో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పిఎం నరేంద్ర మోడీ మాట్లాడే మాటలకు జీవితాంతం శిక్ష విధించాల్సి వస్తుందన్నారు. రాహుల్ గాంధీ కేసులకు భయపడేవారు కాదన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రజల తరపున పోరాటం చేయడం కోసం ఎప్పుడు ముందుంటారన్నారు. రెండేళ్ల శిక్షను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజాప్రతినిధులు ప్రజలను మోసం చేస్తుంటే మాట్లాడకూడదు నోరు మూసుకొని ఉండాలని చట్టాలు ఎక్కడ చెప్పలేదన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

పట్టణంలో ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు శ్రీఅభయాంజనేయ స్వామి గుడిలో 108 టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. వైసిపి యువ నేత, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో జీవించాలని ప్రార్థనలు చేశారు. ఏరియా ఆస్పత్రిలో రోగులకు అన్నదానం ఏర్పాటుచేశారు. మనోజ్ రెడ్డి మాట్లాడుతూ... తమ తండ్రి, ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో ప్రజా సేవకే అంకితమయ్యారని తెలిపారు. తండ్రి బాటలోనే తాను కూడా కార్యకర్తలు, ప్రజల కోసం నిరంతరం పని చేసి పార్టీ ప్రతిష్టను పెంచుతామన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, మున్సిపల్ ఛైర్మన్ శాంత, నాయకులు చంద్రకాంత్ రెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ రేణుక, మార్కెట్ యార్డు ఛైర్మన్ మహబూబ్ బాష, వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, డిస్ట్రిక్ వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ నియాజ్ అహ్మద్, రాష్ట్ర డైరెక్టర్ హమ్మద్ బాష, మహిళలు శ్రీలక్ష్మి, జులేఖ, శోభ లత, ఫర్హాద్ భాను, శ్రీదేవి, కౌన్సిలర్లు రాజేశ్వర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, వార్డు ఇన్‌ఛార్జీలు తాయన్న, చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు నరసింహులు, ఎంఎంజి.గౌస్, నాయకులు మధుసూదన్ శర్మ, సన్నీ, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్ రాజు, మల్లికార్జున, రంగస్వామి, సూరి, రమేష్, ఎరుకల వెంకటేష్, బాలు, రైల్వే ఈరన్న, దానం, శీను పాల్గొన్నారు.

పోషకాహార లోప నివారణకు రాగి జావ

- వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాగి జావ పంపిణీ చేస్తున్న జగన్మోహన్ రెడ్డి

విద్యార్థుల్లో పోషకాహార లోపం నివారణకు రాగిజావ పంపిణీ చేస్తున్నట్లు వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్, శ్రీనీలకంఠేశ్వర స్వామి హైస్కూల్‌లో రాగి జావ పంపిణీ చేశారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. ఉన్నత విద్యతో పాటు మంచి ఆరోగ్యాన్ని, పౌష్టికాహారం అందించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్ అహ్మద్, పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, అధికార ప్రతినిధి కె.సునీల్ కుమార్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ యుకె.రాజశేఖర్ పాల్గొన్నారు.

'కుక్కల సంతతి తగ్గించేందుకు చర్యలు'

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో కుక్కల సంతతిని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని రాంజల చెరువు వద్ద కుక్కలకు శస్త్ర చికిత్స చేసేందుకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పట్టణంలో సుమారు 4 వేల వీధి కుక్కలు ఉన్నట్లు లెక్కలు ఉన్నాయన్నారు. వాటిని బంధించి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు న్యాయపరమైన సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామన్నారు. పశుసంవర్ధక శాఖ వైద్యుల సహకారంతో కుక్కలకు సంతతి నివారణ కోసం శస్త్ర చికిత్సలు చేయిస్తున్నామని చెప్పారు. రోజుకు 20 నుంచి 40 కుక్కల వరకు సంతతి నివారణకు శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు బోన్లు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కుక్క కాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మున్సిపల్ శానిటేషన్ మేస్త్రి నరసింహులు ఉన్నారు.

గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ మృతి

హాలహర్వి : గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ గాదిలింగప్ప గురువారం గుండెపోటుతో మృతి చెందారు. హొళగుంద మండలం చిన్నహ్యాట గ్రామానికి చెందిన గాది లింగప్ప హాలహర్వి గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న గృహ నిర్మాణ శాఖ ఎఇ వెంకటేష్ హుటాహుటిన గ్రామానికి చేరుకుని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంపిడిఒ ఆంథోని, ఇఒఆర్‌డి మల్లికార్జున, సిఐటియు మండల అధ్యక్షులు కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

గోనెగండ్ల : గోనెగండ్లతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉగాది వేడుకలను రెండు రోజులపాటు ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం ఉదయం నుంచి ఒకరిపైఒకరు రంగులు చల్లుకుంటూ వసంత పంచమి వేడుకలు నిర్వహించుకున్నారు. సాయంత్రం సంత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ప్రభను అందంగా ముస్తాబు చేసి వీరశైవ పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో శివాలయం వరకు ఊరేగించారు. నంది కోళ్ల నృత్యం, చిన్నారుల కోలాట ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకుంది.

పెనాల్టీలతో విసుగు..?

- ఆదోనిలో దడ పుట్టిస్తున్న పోలీసుల వ్యవహారం

ప్రజాశక్తి - ఆదోని

శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించి వారి కర్తవ్యానికి ఆటంకం కలిగిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. ఉదయం లేవగానే భద్రత చర్యలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట, తదితర వాటిపై మాట్లాడాల్సిన పోలీసులు పెనాల్టీ ఎంత వసూలు చేయాలి, ఎంత జమ చేయాలో లక్ష్యాలు వస్తుండడంతో కొందరు తలలు పట్టుకుంటున్నారు. ఉదయం పూట కార్యాలయానికి, దుకాణం తెరిచేందుకు, ఇతర పనుల కోసం వెళ్తున్న వారిని పోలీసుల అటకాయించి లైసెన్స్ లేదనో, ఆర్‌సి లేదనో ఫైన్లు వేస్తున్నారని చెబుతున్నారు. ఇది కాదని కరోనా సమయంలో పెండింగ్‌లో ఉన్న పెనాల్టీ వసూళ్లకు పేపర్లు పట్టుకుని రోడ్డున నిలిచి బైకులను ఆపి వసూలు చేయడం వల్ల కొందరు తప్పించుకునే ప్రయత్నంలో కిందపడిన సందర్భాలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు. సాంప్రదాయంలో వచ్చే పెద్ద పండగ ఉగాది ఉందని ప్రజలు అప్పో, సప్పో చేసి, ఎవరి స్థాయికి తగ్గట్లుగా వారు పండగ చేసుకుంటారు. పూలు, పండ్లు, కూరగాయలకు, పూజా సామగ్రి, పండగకు కావాల్సిన ముడిసరుకులు, బట్టలు ఇలా వగైరా వగైరా

పెనాల్టీ వసూలు చేస్తున్న పోలీసులు

అంటూ పట్టణంలోని ఎఎన్ రోడ్డు, ఎంఎం రోడ్డు ప్రజలు, ద్విచక్ర వాహనాలతో, ఆటోలతో, తోపుడుబండ్లతో కిక్కిరిసి ఉంటుంది. ట్రాఫిక్ సమస్యను, ప్రజల అవసరాలను గాలికొదిలేసి వచ్చిన ప్రతి వాహనాన్నీ ఆపుతూ, పాతఫైన్లు కట్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి చూపించండి అంటూ పండగ సరుకుల కోసం తెచ్చుకున్న డబ్బులను చలానాల రూపంలో రక్షకభటులే ముక్కుపిండి వసూలు చేస్తున్నారని పలువురు ఆవేదన చెందుతున్నారు. 'ఇదేం ఘోరం సార్' అని సగటు మనిషి అడిగితే... 'మాదేముంది. ప్రభుత్వ ఆంక్షలు ఇవి. కట్టాల్సిందే' అంటు హుకుం జారీ చేస్తున్నారు. ప్రజలు మింగలేక, కక్కలేక 'మాకు ఇదేం కర్మ' అంటూ అటు ప్రభుత్వంపైనా, ఇటు పోలీసులపైనా విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఉన్న వారు కడుతూ, లేనివారు 'సార్, సార్' అని వేడుకుంటున్నా, కనికరం చూపడం లేదని పలువురు వాపోయారు. పాలకులు ఈ విషయంపై దృష్టి సారించి ప్రజల కష్టాలను అర్థం చేసుకుని అధికారులకు తెలిపి ఈ పెనాల్టీల గోల నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్నారు.

ట్రాఫిక్‌ను గాలికొదిలేసిన పోలీసులు

ఆదోని పట్టణంలోని పండిట్ నెహ్రూ రోడ్, మున్సిపల్ మెయిన్ రోడ్డు ప్రాంతాలు ఇరుకుగా ఉంటున్నాయి. ఎదురుగా వాహనాలు వస్తే తప్పించుకునే అవకాశం లేదు. 20 ఏళ్లుగా వన్ వే అమలు జరిగేది. ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులు ఉన్నారా లేదా అన్న సందేహం వ్యక్తమవుతోంది. ఆటోలు, బైకులు ఎక్కడ పడితే అక్కడ నిలపడం వల్ల ఆ రోడ్లు పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. ఫైన్ల వసూళ్లపై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసులు చూపడం లేదన్నది బహిరంగ విమర్శ. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉల్లాసంగా పిడకల సమరం...

- కైరుప్పలలో వైభవంగా నుగ్గులాట

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

ప్రజాశక్తి - ఆస్పరి

సాయంత్రం సంధ్య వేళలో వయస్సుతో నిమిత్తం లేకుండా యువకులు, పెద్దలు పిడకల సమరంలోకి దిగారు. దాదాపు అరగంట హోరాహోరీగా రెండు వర్గాలు పిడకల సమరాన్ని కొనసాగించారు. ఈ పిడకల సమరంలో కొంత మందికి గాయాలు కాగా వారు చికిత్సలు చేసుకున్నారు. గురువారం కైరుప్పల గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయ ఆవరణంలో జరిగిన నుగ్గులాటలో భాగంగా ఈ వేడుక సాగింది. ప్రతేడాది ఉగాది సందర్భంగా వీరభద్ర స్వామి ఉత్సవాల్లో భాగంగా పండగ మరుసటి రోజు నుగ్గులాట చేపట్టడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా జరిగే పిడకల సమరాన్ని వీక్షించేందుకు కైరుప్పల చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పిడకల సమరం ఎందుకు సాగుతుందంటే...

వీరభద్ర స్వామి, కాళికాదేవి ఇద్దరు ప్రేమించుకుంటారు. పెద్దల అంగీకారంతో పెళ్లి కూడా కుదురుతుంది. పెళ్లి విషయంలో వీరభద్ర స్వామి ఆలస్యం చేయడంతో కాళికా మాత ఆగ్రహిస్తుంది. వీరభద్రస్వామి సేద తీరేందుకు హంద్రీ నది ఒడ్డుకు వస్తుండగా కాళికా మాత వర్గీయులు పిడకలతో దాడికి దిగుతారు. ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కల గ్రామ దేవతలైన కార్తికేయ, గిడ్డాంజనేయ స్వామి ఇద్దరి మధ్య సయ్యదు చేసి పెళ్లి జరిపిస్తారు. అప్పటి నుంచి నేటి వరకు పిడకల సమరం జరుగుతుందని పెద్దలు చెబుతున్నారు.

అశ్వంపై వస్తున్న నంద కిశోర్‌రెడ్డి

కారుమంచి నందకిషోర్ రెడ్డి రాకతో

కారుమంచి గ్రామానికి చెందిన పెద్ది రెడ్డి వంశస్తులు అశ్వంపై కైరుప్పలకు రావడం నుగ్గులాట జరగడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా పెద్దిరెడ్డి వంశానికి చెందిన నందకిశోర్ రెడ్డి అశ్వంపై రాచరికాన్ని తలదన్నేలా తలపాగా ధరించి చేతిలో కత్తి పట్టుకొని మంది మార్బలంతో కారుమంచి గ్రామం నుంచి కైరుప్పల గ్రామంలో వెలసిన వీరభద్ర స్వామి, కాళికా దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తిరిగి స్వగ్రామానికి వెళ్లిన తర్వాత నుగ్గులాట జరుగుతుంది. సాయంత్రం జరిగిన నుగ్గులాటలో వందలాది మంది పాల్గొన్నారు. ఈ పిడకల సమరంలో 30 మందికి గాయాలయ్యాయి. ఈ ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆలూరు సిఐ ఈశ్వరయ్య, ఆస్పరి ఎస్ఐ వరప్రసాద్ తో పాటు నలుగురు ఎస్ఐలు, 80 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం...

- మొదలైన తాగునీటి కష్టాలు

- ఆందోళన చెందుతున్న మండల ప్రజలు

ప్రజాశక్తి - హొళగుంద

అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా హొళగుందతో పాటు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. వారం పది రోజులైనా తాగునీరు అందకపోవడంతో మండల ప్రజల ఆందోళన చెందుతున్నారు. ఎల్‌ఎల్‌సి కాలువ హొళగుందను ఆనుకుని ప్రవహిస్తున్నా తాగునీరు అందడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

హొళగుంద 7వ వార్డులో గత వారం రోజులుగా తాగునీరు లేక కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేజర్ పంచాయతీలో జనాభా ప్రతిపాదించిన వాటర్ మేన్‌లను నియమించుకున్నప్పటికీ ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం దారుణమని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఎల్‌ఎల్‌సి కాలువలో సమృద్ధిగా నీరు ప్రవహిస్తున్నా గ్రామస్తుల తాగునీటి అవసరాల కోసం కేటాయించిన నీటిని వినియోగించుకోవడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. గతేడాది చేపట్టిన ఎల్‌ఎల్‌సి ఆధునీకరణ పనులు పూర్తికాకుండానే మధ్యలో ఆగిపోయాయి. ఈ పనులను పునరుద్ధరించడానికి మార్చి నెలాఖరులో లేదా ఏప్రిల్ మొదటి వారంలో తుంగభద్ర బోర్డు అధికారులు ఎల్‌ఎల్‌సికి నీటిని నిలుపుదల చేస్తున్నట్లు సమాచారం. వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను ఇప్పటి నుంచే పూర్తిస్థాయి నీటిమట్టం నింపుకుంటే తాగునీటి సమస్యను నివారించవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇక్కడ అలాంటి చర్యలేమీ కానరాక పోవడం బాధాకరమని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఖాళీ బిందెలతో ఆందోళన చేపడుతున్న మహిళలు

తాగునీరందించడంలో అధికారుల నిర్లక్ష్యం

- సిద్దయ్య, 7వ వార్డు

తాగునీరందించడంలో మేజర్ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గత వారం రోజులుగా తాగునీరు లేక కాలనీవాసులు అవస్థలు పడుతుంటే అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే మేజర్ పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేపడతాం.

సినీ నటులు దర్శన్‌కు మెమొంటో అందజేస్తున్న పీఠాధిపతులు

కొనసాగుతున్న కర్ణాటక భక్తుల రద్దీ

- ఆలయం మూసేయకుండా దర్శనం కల్పించాలని కోరిన ఎస్ఐ వేణుగోపాల్ రాజు

- శ్రీమఠం పీఠాధిపతులు, మేనేజర్‌ను కలిసిన ఎస్ఐ

- ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించిన ఎస్ఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక భక్తుల రద్దీ గురువారం పెరిగింది. ఉగాది సందర్భంగా శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకున్న భక్తులు తిరుగు ప్రయాణంలో రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వాహనాల ద్వారా మంత్రాలయం చేరుకున్నారు. ఒక్కసారిగా భక్తుల కోలాహలం పెరగడంతో ఎస్ఐ వేణుగోపాల్ రాజు ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు. సిబ్బందిని అప్రమత్తం చేసి ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసే పనిలో పడ్డారు. మరోవైపు దర్శన సమయంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మధ్యాహ్నం ఆలయం మూసివేయకుండా దర్శనం కొనసాగించాలని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులను, మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావును కోరారు. ఈ విషయంపై పీఠాధిపతులతో పాటు మేనేజర్ సానుకూలంగా స్పందించి దర్శనం కొనసాగడంపై భక్తుల్లో ఆనందం వ్యక్తమయింది. ట్రాఫిక్ నియంత్రణకు ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఆధ్వర్యంలో శ్రీమఠం ముఖద్వారం, ఎన్‌టిఆర్ సర్కిల్, రాఘవేంద్ర సర్కిల్ వంటి ప్రాంతాల్లో సిబ్బందిని అప్రమత్తం చేశారు.

రాఘవేంద్రుని దర్శించుకున్న కన్నడ సినీ నటులు

మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్ర స్వామిని కన్నడ సినీ నటులు దర్శన్, సృజన్ లోకేష్‌లు దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని, మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వారికి మెమొంటో

IN THE COURT OF THE HON'BLE 1ST ADDITIONAL JUNIOR CIVIL JUDGE: ADONI
O.S.NO. 98/2021

Between:
N.S. Shaikshavali. ...Plaintiff
And
V. Gowri. ...Defendant

SUMMONS TO DEFENDANT

To:
V. Gowri W/o. V. Siddeswara D/o. Late. Ballekallu Eranna, Hindu, aged about 27 years, H.No. XVIII-212-A, Matkarwadi, Adoni-518301, Kurnool district, A.P.,

Whereas the above named Plaintiff filed above case for Recovery of Regd. Mortgage Deed amount against you. Hence take the summons, if you have got any objection for the above suit, you may appear before this Hon'ble Court on 31.03.2023 at 10:30 A.M. either in person or through an Advocate and file your objection. If you fail to do so, the suit will be decided ex-parte.

// BY ORDER OF THE COURT//
P. RAJA RATHNAM, B.A.LLB.,
ADVOCATE FOR PLAINTIFF, ADONI.
CELL NO: 9989041430

IN THE COURT OF THE HON'BLE 1ST ADDITIONAL JUNIOR CIVIL JUDGE: ADONI
I.A.NO. 131/2021 IN O.S.NO. 98/2021

Between:
N.S. Shaikshavali. ...Petitioner
And
V.Gowri. ...Respondent

SUMMONS TO RESPONDENT

To:
V. Gowri W/o. V. Siddeswara D/o. Late. Ballekallu Eranna, Hindu, aged about 27 years, H.No. XVIII-212-A, Matkarwadi, Adoni-518301, Kurnool district, A.P.,

Whereas the above named Petitioner filed above case for Recovery of Regd. Mortgage Deed amount against you. Hence take the summons, if you have got any objection for the above suit, you may appear before this Hon'ble Court on 31.03.2023 at 10:30 A.M. either in person or through an Advocate and file your objection. If you fail to do so, the suit will be decided ex-parte.

// BY ORDER OF THE COURT//
P. RAJA RATHNAM, B.A.LLB.,
ADVOCATE FOR PETITIONER, ADONI.
CELL NO: 9989041430

IN THE COURT OF THE IIND ADDITIONAL DISTRICT COURT KURNOOL AT ADONI
I.A. 110/2023 IN O.S. 3 OF 2019

BETWEEN
G.T VENKATESULU SETTY ...... PLAINTIFF
Vs
G. GOVINDA RAJULU AND OTHERS ..... DEFENDANTS

TO.
57. G.PUSPAVATHAMMA,
W/o Late G.K.Viswanath Setty, R/O, H.NO.5/380, Near Agricultural Market Comittee, Yemmiganur, D: Kurnool.

59. P.LALITHA,
D/o Late G.K.Viswanath Setty R/O, H NO.5/380. Near Agricultural Market Comittee, Yemmiganur, D: Kurnool.

63. R.PRAMEELA,
D/o,Late G.K. Viswanath Setty. R/O, H.NO.5/380, Near Agricultural Market Comittee, Yemmiganur, D: Kurnool.

Take notice that an I.A. 119/23 in O.S.3/2019 on the file of THE IIND ADDL DISTRICT JUDGE KURNOOL AT ADONI Petitioner filed to add the legal heirs of G.K. VISHWANATH SETTYand that 10-04-2023 has been fixed by the court for the appearance

If no appearance is made on your behalf, by yourself, your pleader, or by some one by law authorized act for you in this I.A. It will be heard and decided in your absence.

SMT. G.M. LALITHA,
ADVOCATE FOR PLAINTIFF,
ADONI.

పిల్లలకు చదువులే ఆస్తి : వైసిపి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

ఆధునిక కాలంలో పిల్లలకు చదువులే ఆస్తిగా ఇవ్వాలని వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని వందగల్లు గ్రామంలో రూ.2.60 కోట్లతో 17 గదులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ప్రత్యేక చొరవతో వందగల్లు గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పాఠశాల అభివృద్ధిలో భాగమైనట్లు తెలిపారు. గ్రామ విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని మాజీ ఎంపిటిసి, ప్రస్తుత సర్పంచి భర్త కాల్వ లక్ష్మయ్య ఉన్నత పాఠశాలకు 30 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారని గుర్తు చేశారు. స్థలదాత లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, పాఠశాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ గోవిందరాజులుతో కలిసి పాఠశాలకు శంకుస్థాపన చేశారు. వైసిపి మండల సీనియర్ నాయకులు నాడిగేని నరసింహులు, ఎంపిటిసి మల్లికార్జున, పీడీ ఖలీల్ అహ్మద్, ఈరన్న, తిమ్మయ్య, జడ్ల అంజినయ్య, నర్సన్న, వెంకటస్వామి, వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు రాజమౌళి, మహబూబ్ బాషా, పులుసు నారాయణ, చింతలగేని రాముడు, పులుసు రామకృష్ణ, ఆవుల తిక్కయ్య పాల్గొన్నారు.

కొత్తపేట రోడ్డుకు మోక్షమెన్నడో..?

- మూడేళ్లుగా శంకుస్థాపనకే పరిమితం

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రభుత్వాలు మారినా ప్రజల జీవితాలు మారడం లేదు. గత అనేక ఏళ్లుగా అధ్వానస్థితిలో ఉన్న గ్రామీణ రహదారుల రూపురేఖలు మారడం లేదు. కొత్త రోడ్ల నిర్మాణాలు శంకుస్థాపనలకు పరిమితమయ్యాయి. అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యంతో గ్రామీణ రహదారులకు మోక్షం లభించడం లేదు.

మండలంలోని కొత్తపేట రోడ్డు మూడేళ్లుగా శంకుస్థాపనకే పరిమితమైంది. కర్నూలు-బళ్లారి రహదారి మధ్యలోని కొత్తపేట బస్ స్టేషన్ నుంచి 7 కిలోమీటర్ల వెంట ఉన్న పుల్లాపురం, తెర్నేకల్ మట్టి రహదారి అధ్వానస్థితికి చేరింది. రహదారిపై గుంతలు, కంకర రాళ్లు తేలడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాల రైతులు పండించిన పంట ఉత్పత్తులను ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు మార్కెట్ యార్డుకు విక్రయించడానికి వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. అనారోగ్యానికి గురైన వారు, బాలింతలు, గర్భిణులు

అధ్వానంగా ఉన్న కొత్తపేట రోడ్డు

ఆ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ఇబ్బంది పడుతున్నారు. గత మూడేళ్ల క్రితం రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆ గ్రామానికి ప్రభుత్వం మంజూరు చేసిన నూతన రోడ్డుకు శంకుస్థాపన కూడా చేశారు. రోడ్డు నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇంతవరకు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయండి

- నరసింహ, కొత్తపేట

మా గ్రామ రహదారి అధ్వానస్థితికి చేరింది. త్వరగా రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలి. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ కల్వర్టు పనులు మాత్రమే చేశారు. మట్టి రహదారి గుంతలమయమై ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం.

అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం తగదు

- వెంకటేష్, కొత్తపేట

ప్రభుత్వం అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం చేయడం తగదు. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి మూడేళ్లు గడిచినప్పటికీ నిర్మాణ పనులు చేపట్టకపోవడం దారుణం. రహదారి నిర్మాణ పనులు చేపడితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

పేరుకే ఆర్‌ఎంపి...

- రోగులకు ఎమ్‌డి స్థాయిలో వైద్య సేవలు

- సకల రోగాలకు వైద్యం చేస్తున్న ఓ ఆర్‌ఎంపి

- పట్టించుకోని జిల్లా వైద్యాధికారులు

చిన్నారికి సెలైన్ బాటిల్ ఎక్కిస్తున్న ఆర్‌ఎంపి

ప్రజాశక్తి - హొళగుంద

ఆయన పేరుకు మాత్రమే ఆర్‌ఎంపి... రోగులకు మాత్రం ఎమ్‌డి స్థాయిలో వైద్య సేవలు అందిస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతూ వైద్యుల కష్టాన్ని సొమ్ము చేసుకుంటున్నాడు. ఈయనపై జిల్లా వైద్యాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండల ప్రజలు మండిపడుతున్నారు.

హొళగుందలో ఒక ఆర్‌ఎంపి వైద్యశాస్త్రంలో కనీస అవగాహన లేకపోయినప్పటికీ ఆయుర్వేదిక్ పాటు ఇంగ్లీష్ వైద్య సేవలు అందిస్తున్నాడు. గ్రామంలో ఆర్‌ఎంపి స్థాయి వైద్యులు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాలని నిబంధనలు ఉన్నాయి. అనారోగ్యంతో వచ్చిన వారికి ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాలి. రోగం నయం కాకపోతే మెరుగైన చికిత్స కోసం ఎంబిబిఎస్ లేదా ఎమ్‌డి స్థాయి వైద్యుల వద్దకు లేదా ప్రభుత్వాస్పత్రులకు పంపాలి. ఆర్‌ఎంపి మాత్రం ఎయిడ్స్, క్యాన్సర్, మూల వ్యాధి సంబంధిత రోగాలకు ఆయుర్వేదిక్ మందులున్నాయి, నయం చేస్తానంటూ గ్రామీణ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దోపిడీకి పాల్పడుతున్నాడు. హొళగుందలో కొన్నేళ్లుగా క్లినిక్ నడుపుతూ రూ.లక్షల్లో అక్రమ సంపాదన కూడగట్టుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ కొనసాగిస్తున్న ఆర్‌ఎంపి ఓ నర్సింగ్ హోమ్ ఉన్నట్లు రోగులకు సెలైన్ బాటిల్స్ ఎక్కిస్తూ ఉంటాడు. రక్తమార్పిడి, మూల వ్యాధికి ఆపరేషన్లు చేస్తూ గ్రామాల్లో కాన్పులు కూడా చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాడు. ఆ ఆర్‌ఎంపిపై జిల్లా వైద్యాధికారులు కఠిన చర్యలు తీసుకుని గ్రామీణ ప్రాంత ప్రజల జీవితాలను కాపాడాలని ప్రజాసంఘాల నాయకులు, మండల ప్రజలు కోరుతున్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటం....

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ, ప్రజా వ్యతిరేక విధానాలపై భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల స్ఫూర్తితో పోరాడదామని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ కోరారు. గురువారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా దేవనకొండ, కోటకొండ, తెర్నేకల్ గ్రామాల్లో డివైఎఫ్ఐ, సిఐటియు, రైతుసంఘం, వ్యకాస ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో అశోక్, ఓంకార్, అధ్యక్షత వహించారు. వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి సంజన, డివైఎఫ్ఐ మండల నాయకులు శ్రీనివాసులు మాట్లాడారు. నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలపై భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు నాగేష్, పాండు, బజారి, అనిల్, శ్రీకాంత్, నాగరాజు, రంగస్వామి, సుధాకర్, మహబూబ్, శివ, లక్ష్మన్న, పరమేష్, బజారి, రాముడు, శ్రీరాములు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలో డివైఎఫ్ఐ ఎన్‌టిఆర్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. వినోద్ అధ్యక్షత వహించారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డివైఎఫ్ఐ నాయకులు రవి, గౌడ్, రాకేష్, ఈరన్న, వీరేష్, ఉపేంద్ర, వివేక్, మాస్ పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని పచ్చారపల్లి గ్రామంలో భగత్ సింగ్, రాజ్ గుర్, సుఖ్ దేవ్‌ల వర్ధంతి సందర్భంగా పచ్చారపల్లి భగత్‌సింగ్ యూత్ జనార్ధన అధ్యక్షతన నివాళులర్పించారు. పచ్చారపల్లి భగత్ సింగ్ యూత్ సభ్యులు మహబూబ్ బాషా, శంకర్ గౌడ్, సుధాకర్, మౌలాలి, గోపాల్, వన్నప్ప, కాళింగ, శ్రీనివాసులు, చంద్ర, పాండు, రాజశేఖర్, బసవ, శివ, అంజి, భీమేష్, మధు, పాల్గొన్నారు. **ఆదోని**లోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. డివైఎఫ్ఐ నాయకులు వీరేష్, నాయకులు శీను, నాగరాజు, గౌస్, మోహన్, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు. **కోసిగి (రూరల్)**లోని నారాయణ డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ షేక్షావలీ హాజరయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బి.రాజు పాల్గొన్నారు. **ఆలూరు** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కిల్ హబ్‌లో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్ అధ్యక్షత వహించారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు రోప్, శ్రీనివాసులు, డివైఎఫ్ఐ నాయకులు మహేష్, శేషాద్రి పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలం కల్లుకుంట, నవ్లేకల్, మేకడోనా గ్రామాల్లో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు నివాళులర్పించారు. ప్రజాసంఘాల నాయకులు ఈ.తిక్కన్న గౌడు, యు.శ్రీనివాసులు, ఉరుకుంద, మునీ, గణేష్, తిక్కన్న, విజయ్, సుందరేష్, అంజి, ఈరన్న, చంద్రన్న పాల్గొన్నారు. **హొళగుంద** మండలంలోని ఇంగలదహల్ గ్రామంలో బాలుర వసతి గృహంలో వసతి గృహ సంక్షేమ అధికారి శివుడు ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, హాస్టల్ సిబ్బంది చంద్రకాంత్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ పాఠశాల కమిటీ సభ్యులు శ్రీకాంత్, సాధిక్, మల్లికార్జున పాల్గొన్నారు.

దేవనకొండలో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

కోసిగిలో నివాళులర్పిస్తున్న నాయకులు

భగత్‌సింగ్ ఆశయ సాధనకు పోరాడాలి

- భగత్ సింగ్ లైబ్రరీ ట్రస్టు చైర్మన్ బి.శంకరయ్య

ప్రజాశక్తి - నంద్యాల

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, దోపిడీ, పీడన లేని సమాజం కోసం ఉరికంబం ఎక్కిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లు నేటి యువతకు ఆదర్శనీయమని, ఆయన ఆశయ సాధనకు యువత ఉద్యమల్లోకి రావాలని భగత్‌సింగ్ లైబ్రరీ ట్రస్టు చైర్మన్ శంకరయ్య, ట్రస్ట్ సభ్యులు డాక్టర్ నాగరాజు, తోట మద్దులు పేర్కొన్నారు. జాతీయ స్వాతంత్రోద్యమ యువ విప్లవ కెరటం భగత్ సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక సాయిబాబా నగర్‌లోని భగత్ సింగ్ లైబ్రరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహనికి తోట మద్దులు, మాదాల శ్రీనివాసులు, సుఖదేవ్ విగ్రహానికి డాక్టర్ నాగరాజు, రాజ్‌గురు విగ్రహానికి డాక్టర్ రామకృష్ణ రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లు మరణించి నేటికి 92 సంవత్సరాలు అయినా వారి అమరత్వాన్ని, పోరాట స్ఫూర్తిని నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నేటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ యువత ఉద్యమించాలని అన్నారు. అనంతరం ప్రజా గాయకులు చిన్న బాలహుస్సేని, వీరసేన, రమణలు భగత్ సింగ్‌పై పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జివి రమణ, నారాయణ, రైతు నాయకులు సురేష్, లాయర్ పుణీత్, భాస్కర్, రామామూర్తి, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు. **పిడిఎస్‌యు ఆధ్వర్యంలో** పట్టణంలోని పిడిఎస్‌యు కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు రాంబాబు, డివిజన్ ప్రధాన కార్యదర్శి శివశంకర్, నాయకులు సతీష్, మాబు, హుస్సేన్, సుబ్బారెడ్డి, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు. **నంద్యాల కలెక్టరేట్ :** నేటి యువతకు భగత్ సింగ్ జీవితం స్ఫూర్తిదాయక మని సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు లక్ష్మణ్ అన్నారు. గురువారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి (మిగతా 6వ పేజీలో..)

రంజాన్ వేళలు

శుక్రవారం
ఇఫ్తార్ : 6 : 35

శనివారం
సహేరి : 4 : 56

ఉగాదీ పాయె...ఇంకెప్పుడు.?

- జగనన్న కాలనీల గృహ ప్రవేశాలు మళ్లీ వాయిదా
- నిర్మాణాలు పూర్తి కాకపోవడమే కారణం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉగాదికి సొంతింటిలో చేరాలని భావించిన పేదలకు మళ్లీ నిరాశ ఎదురైంది. ఇప్పటికే పలు దఫాలు వాయిదా పడిన జగనన్న కాలనీల గృహ ప్రవేశం మరోసారి వాయిదా పడింది. మొదట గత ఏడాది డిసెంబరు అన్నారు. ఆ తర్వాత సంక్రాంతికి ఉండొచ్చన్నారు. తరువాత ఉగాది అన్నారు. ఉగాది కూడా దాటిపోయింది. ఇలా వాయిదాల పర్వం కొనసాగుతుండటంతో గృహ ప్రవేశాలు ఇంకెప్పుడు చేస్తారోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి...

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్ల స్థలాలను పంపిణీ చేసింది. గృహ నిర్మాణాలకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందిస్తోంది. జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. గతేడాది జూన్‌లో శంకుస్థాపన వారోత్సవాలు నిర్వహించారు. లబ్ధిదారులతో భూమిపూజ కూడా చేయించారు. ఆ కాలనీలలోని ఇళ్ల గృహ ప్రవేశాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత గతేడాది డిసెంబర్ చివర్లో గృహ ప్రవేశం ఉంటుందని అన్నారు. తరువాత సంక్రాంతికి మార్చాయి. ఇప్పుడు సంక్రాంతి కూడా పోవడంతో ఉగాదికి గృహ ప్రవేశాలు చేయించాలని భావించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో గృహ ప్రవేశాలు ఉగాదికి కూడా సాధ్యం కాలేదు. క్షేత్ర స్థాయిలో వాలంటీర్ల నుంచి సిబ్బంది, అధికారులు అందరూ లబ్ధిదారులపై ఒత్తిడి తెచ్చినా వారు ముందుకు కదలలేదు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 48,751 మందికి ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. వాటిలో ఇప్పటి వరకూ 40,897 గ్రౌండింగ్ అయ్యాయి. అయితే వాటిలో 13,315 ఇళ్లు మాత్రమే పునాది స్థాయి, పునాది కంటే పై స్థాయికి చేరాయి. మిగిలిన వన్నీ పునాది స్థాయిలోపే ఉన్నాయి. 7,854 ఇళ్లు అసలు ప్రారంభమే కాలేదు. ఇప్పటి వరకూ 1,824 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. గ్రౌండింగ్ అయిన ఇళ్లలో 4.45 శాతం ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80లక్షలనే రాష్ట్ర ప్రభుత్వం ఈ జగనన్న కాలనీ లబ్ధిదారులకు అందిస్తోంది. బయట మార్కెట్‌లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నిర్మాణ సామాగ్రి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో ఇళ్లను నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. డబ్బులున్న వారు మాత్రమే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారుల ఒత్తిడితో మరికొందరు వడ్డీలకు అప్పులు తెచ్చి, బంగారు తాకట్టు పెట్టి ఇళ్లను నిర్మించుకుంటున్నారు.

చాగలమర్రిలో పునాదికే పరిమితమైన జగనన్న కాలనీ

మౌలిక సదుపాయాలూ కరువే..

ఇంటి పట్టాలు ఇచ్చిన ప్రాంతాలు నివాసయోగ్యంగా లేకపోవడంతో లబ్ధిదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. కర్నూలు నగరంలో ఇప్పటికే పేదలకు పట్టాలిచ్చిన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించలేదు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13 వేల మందికి 2007లో ఇందిరమ్మ ఇళ్లు ఫేజ్-2 కింద జగన్నాథగట్టు వద్ద పట్టాలిచ్చారు. అప్పట్లో సిపిఎం ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్ చొరవతో ఇందిరమ్మ ఇళ్లు ఫేజ్-3 కింద 2008లో పందిపాడు వద్ద 52 ఎకరాలను కొనుగోలు చేసి 2500 మంది లబ్ధిదారులకు ఇచ్చారు. ఆ రెండు ప్రాంతాల్లో ఇప్పటి వరకూ ప్రభుత్వం విద్యుత్, నీరు, రోడ్లు వంటి ఎటువంటి మౌలిక వసతులూ కల్పించలేదు. దీంతో 10 శాతం లబ్ధిదారులు కూడా ఆ ప్రాంతాల్లో గృహాలను నిర్మించుకోలేదు. దీనికి తోడు ఒరిజినల్ పట్టాలు హౌసింగ్ కార్పొరేషన్ దగ్గర ఉండిపోవడంతో వారికి ఆ స్థలాలపై పూర్తి హక్కులు కూడా లేకుండా పోయాయి. తరువాత వచ్చిన టిడిపి ప్రభుత్వం వాటిపైన దృష్టి సారించలేదు. ఇప్పుడున్న వైసిపి ప్రభుత్వం కూడా ఆ ప్రాంతాల వైపు చూడకపోవడంతో లబ్ధిదారులు రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం నగరానికి 15 కిలోమీటర్ల దూరంలోని రుద్రవరంలో పట్టాల్విడం పట్ల కూడా లబ్ధిదారుల నుంచి అసహనం వ్యక్తమవుతోంది.

అశ్వ వాహనంపై స్వామి అమ్మవార్లు

- శ్రీశైలంలో ఘనంగా ఉగాది మహోత్సవాలు

ప్రజాశక్తి-శ్రీశైలం

ఉగాది పర్వదిన సందర్భంగా శ్రీశైల క్షేత్రంలో ఐదోరోజు మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉగాది మహోత్సవాలలో భాగంగా గురువారం పూర్ణాహుతి, అశ్వ వాహనంపై స్వామి అమ్మవార్లు, నిజాలంకారంలో భ్రమరాంబ దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాల్గొన్నారు. ఇందులో ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు వేద పండితులు పాల్గొని సాంప్రదాయబద్ధంగా నారికేలములు పలు సుగంధ ద్రవ్యాలు ముత్యం పగడం నూతన వస్త్రాలు తదితర ద్రవ్యాలను హోమ గుండంలో వేద మంత్రాలు మధ్య సమర్పించారు. ఆ తర్వాత వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం అవబృందం, త్రిశూల స్నానం వంటి కార్యక్రమాలు మల్లికా గుండంలో చండీశ్వరునికి సంప్రోక్షణ త్రిశూల స్నానం కార్యక్రమాలు నిర్వహించారు.

అశ్వ వాహనంపై స్వామి అమ్మవార్లు : అశ్వ వాహనంపై స్వామి అమ్మ వాళ్ళు ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయం చుట్టూ ప్రదక్షిణ కార్యక్రమాన్ని వేదమంత్రాలు మధ్యనిర్వహించారు.

నిజాలంకరణలో భ్రమరాంబ దేవి : ఉత్సవాలలో భాగంగా అమ్మవారు 5వ రోజున భ్రమరాంబ దేవి నిజాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఉత్సవమూర్తికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిగిలిన రోజులలో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు కానీ ఒక ఉగాది మరుసటి రోజున మాత్రమే సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే భక్తులకు ఈ విధంగా దర్శన ఇస్తారు. నిజాలంకరణలో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అశ్వ వాహనంపై గ్రామోత్సవంలో స్వామి అమ్మవార్లు

ఘనంగా ఉగాది పర్వదిన వేడుకలు

- జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి
- జిల్లా పరిషత్ చైర్మన్, కలెక్టర్
- కరణం సుధీంద్ర ఆచారి ఉగాది పంచాంగ శ్రవణం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

శోభకృత్ నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలు ఉండాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆకాంక్షించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో దేవదాయ ధర్మాదాయ శాఖ, పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, డిఆర్ఒ పుల్లయ్య, డిసిఎంఎస్ చైర్మన్ సి.హెచ్ శిరోమణి మద్దయ్య, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టరేట్ ఆవరణ నుండి వీడియో కాన్ఫరెన్స్ హాల్ వరకు మంగళ వాయిద్యాల మధ్య జిల్లా కలెక్టర్‌కు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో తొలుత కరణం సుధీంద్ర ఆచారి శాస్త్రోక్తంగా గణపతి పూజ నిర్వహించి ఆశీర్వదించారు. అనంతరం పంచాంగ శ్రవణం గావించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ షడ్రుచుల సమ్మేళనమై ఉగాది పచ్చడి అందరిలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తుందన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో వర్ధిల్లాలని, ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలందరికీ అన్ని శుభాలే కలగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తూ అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

పంచాంగానికి హాజరైన కలెక్టర్, జడ్పి చైర్మన్, మున్సిపల్ చైర్మన్, డిఆర్ఒ

అర్చకులకు ఉగాది పురస్కారాల ప్రదానం :

దేవదాయ ధర్మాదాయ శాఖ ద్వారా ప్రభుత్వం నుండి జిల్లాకు చెందిన కోటపాడు గ్రామ చెన్నకేశవ స్వామి దేవాలయ అర్చకులు శ్రీనివాసులు, నంద్యాల పట్టణంలోని బ్రహ్మానందీశ్వర స్వామి దేవాలయ అర్చకులు రాచకొండ మురళీకృష్ణ శర్మ, నొస్సం గ్రామ బుగ్గ వెంకటేశ్వర రామలింగేశ్వర స్వామి దేవాలయ అర్చకులు పెట్టిన కోట శ్రీకాంత్ శర్మలకు రూ.10,116ల పారితోషికం, ప్రశంసా పత్రం, కండువాలను జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్, మున్సిపల్ చైర్ పర్సన్ తదితరులు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో డిఎంహెచ్ఒ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, డిఎస్ఒ ఆచార్యులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంచాంగాన్ని వివరిస్తున్న వేద పండితులు

సరిహద్దు రాళ్ల ప్రక్రియను పూర్తి చేయండి

- సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గ్రామాల్లో చేపట్టిన రీ సర్వే పనులకు సరిహద్దు రాళ్ల నాటే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర భూ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను సూచించారు. గురువారం విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం నుండి రీసర్వే పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్లు, జెసిలతో సిసిఎల్ఎ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, జెసి నిశాంతి, డిఆర్ఒ పుల్లయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీరామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిర్ క్రాఫ్ట్ సర్వేకు సంబంధించి పెండింగ్లో వున్న 84 చెక్ పాయింట్లను ఈనెల 30వ తేదీలోగా పూర్తి చేస్తామని సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి వివరించారు. అంతకు ముందు సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన రీ సర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. ఫేస్-2 కింద పెండింగ్లో ఉన్న గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను ఈ నెలాఖరు లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సర్వ నరసింహస్వామిని దర్శించుకున్న జెసి

ప్రజాశక్తి - శిరివెళ్ల : మండలంలోని నల్లమల అడవిలో వెలసిన సర్వ నరసింహస్వామి ఆలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఆలయం వద్దకు చేరుకోగానే ఆలయ చైర్మన్ రేవనూరు రామాంజనేయ రెడ్డి, మహాదేవపురం సర్పంచి పెద్ది రమణయ్యలు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈవో నరసయ్య ఆధ్వర్యంలో అర్చకులు వేద పండితుల ద్వారా జెసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, అభివృద్ధి గురించి చైర్మన్‌ను, సర్పంచును అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెసిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జ్యోతి బాబు, అలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నాగిరెడ్డి, విఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

సుంకులమ్మకు బిసి రాజారెడ్డి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని తమ్మడపల్లె గ్రామంలో వెలసిన సుంకులమ్మ అమమవారికి మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పండుగ సందర్భంగా గ్రామ టిడిపి నాయకుల ఆహ్వానం మేరకు గ్రామానికి వచ్చిన బిసి రాజారెడ్డికి నాయకులు పూలమాలలతో స్వాగతం పలికారు . అనంతరం అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి నాయకులు, బిసి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - పాణ్యం : పాణ్యం మండలంలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ దస్తగిరి గురువారం తెలిపారు. పాణ్యం గ్రామ పంచాయతీ సచివాలయం 4 పరిధిలో బిసి జనరల్‌కు 2, మండలం లోని కొండ జూటురులో ఎస్‌సికి-1 పోస్టులు ఖాళీగా వున్నాయని, సంబంధిత గ్రామ యువత ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

25న మార్కెట్ వేలం పాటలు

ప్రజాశక్తి - రుద్రవరం : ఈ నెల 25న రుద్రవరం మేజర్ పంచాయతీ మార్కెట్ వేలంపాటలు నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి మహమ్మద్ రఫీ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు వారపు సంత మార్కెట్, దినసరి మార్కెట్, పశు వధశాల మార్కెట్లకు సంబంధించి వేలంపాటలు సర్పంచ్ బైరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నా మన్నారు. వారపు సంతమార్కెట్‌కు రూ.50 వేలు, దినసరి మార్కెట్ రూ.50 వేలు, పశు వధ శాలకు రూ.5 వేలు ప్రకారం డిపాజిట్ చెల్లించి రూ. 2 లక్షలకు ఆస్తి ధ్రువీకరణ పత్రం సమర్పించి బహిరంగ వేలం పాటల్లో పాల్గొన్నవచ్చున్నారు.

వైభవంగా చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - బనగానపల్లె

శోభకృత్ నామ తెలుగు సంవత్సర ఉగాది ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చారణలతో పంచాంగ పఠనం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలతో అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం వన్నెర బండ్లు దేవస్థానం చుట్టూ తిప్పారు. దేవస్థానానికి వచ్చిన భక్తులకు రామానుజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వసతులను కల్పించారు. గురువారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పిఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, నందివర్గం ఎస్సై రామాంజనేయ రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు : ఇఒ

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ప్రత్యేక వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈవో రామానుజన్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 25, 26వ తేదీ జరిగే జ్యోతి మహోత్సవానికి వచ్చే వేలాది మంది భక్తులు రానున్నట్లు చెప్పారు. జ్యోతి మహోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుండే కాక తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుండి అత్యధికంగా భక్తులు రానున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిర్లు, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు 40 వేల ప్రసాదాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మెడికల్ క్యాంపులు, ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

బోనాలతో చౌడేశ్వరి దేవస్థానానికి వెళుతున్న మహిళలు

చౌడేశ్వరి దేవస్థానంలో వన్నెర బండ్లు తిప్పుతున్న దృశ్యం

ఎన్నికలు ఎప్పుడొచ్చినా టిడిపి విజయం తథ్యం : మాజీ ఎమ్మెల్యే

సంబరాలు జరుపుకుంటున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా టిడిపి విజయం తథ్యమని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని టిడిపి కార్యాలయం సమీపంలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పంచు మర్తి అనురాధ విజయం సాధించడంతో నాయకులు టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పు మొదలైందని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దిమ్మతిరిగే తీర్పు ఇచ్చారని, మూడు స్థానాలలో టిడిపి బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించారని అన్నారు. ఎమ్మెల్యేల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి బలపరిచిన అనురాధ అఖండ విజయం సాధించడం సిఎం పతనం ప్రారంభమైనట్లేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయాన్ని ఎవరు ఆపలేరన్నారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, పట్టణ ఉపాధ్యక్షులు బురానుద్దీన్, పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు మీరాపురం బాలిరెడ్డి, ఎర్రగుడి భాస్కర్ రెడ్డి ,వెంకటాపురం నాగేశ్వరరెడ్డి, అల్లా హుస్సేన్ కెవి రామిరెడ్డి వార్డు మెంబర్ జయన్న తదితరులు పాల్గొన్నారు. **అవుకు :** ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనురాధ 23 ఓట్లతో అనూహ్యంగా విజయం సాధించడం పట్ల అవుకు మండలం కునుకుంట్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గూడాల సోదరులు మురళీధర్ రెడ్డి, ప్రతాపరెడ్డిలు గురువారం హర్షం వ్యక్తం చేశారు. టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **పాణ్యం :** ఎమ్మెల్యే కోటా టిడిపి ఎమ్మెల్సీగా పంచమర్తి అనురాధ 23 ఓట్లతో గెలుపొందడం పార్టీకి పూర్వవైభం వచ్చినట్లే అని లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి లాయర్ బాబు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న గూడాల సోదరులు

దళితుడిపై దాడి హేయమైన చర్య : డిహెచ్‌పిఎస్

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్ : నంద్యాల మండలం మునగాల గ్రామానికి చెందిన దళిత నరహరి ఉగాది పండగ రోజు దైవ దర్శనం కోసం గుడిలోకి వెళుతుంటే అక్కడి అగ్రకులాల వారు కుల వివక్ష చూపుతూ దాడి చేయడం హేయమైన చర్య అని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) జిల్లా నాయకులు ఇ.చెన్నయ్య, ప్రభాకర్‌లు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లా డుతూ దళితుల పట్ల నేటికీ ఇలాంటి సంఘటనలు జరగడం సిగ్గుచేటన్నారు. అధికారులు జరిగిన సంఘటనపై తగు చర్యలు తీసుకొని బాధితుడికి న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ ఆర్థిక కార్యదర్శిగా బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - సంజామల

యుటిఎఫ్ ఆర్థిక కార్యదర్శిగా బాబా ఫక్రుద్దీన్ ఎన్నిక కావడం పట్ల సంజామల మండలంలోని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు గురువారం తెలియజేశారు. యుటిఎఫ్ ఆర్థిక కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకటస్వామి యుటిఎఫ్ మార్గదర్శకులని, వారు ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాడిన నాయకులని అన్నారు. ప్రభుత్వం సిపిఎస్ రద్దు, డిఎలు, పిఆర్సి అరియర్స్ త్వరగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు వెంకటయ్య, నబి రసూల్, విజయ్, అనిల్, సురేంద్ర, రహీంతుల్లా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆర్థిక కార్యదర్శిగా ఎన్నికైన బాబా ఫక్రుద్దీన్

గ్రామ దేవతకు బోనం సమర్పణ

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండల కేంద్రంలోని ప్రజాశక్తి విలేకరి సల్లేపల్లె మల్లికార్జున రెడ్డి, లక్ష్మీ ప్రసన్న ధంపతుల కుమార్తె సల్లేపల్లె లావణ్య రెడ్డి గ్రామ దేవత మారెమ్మ తల్లికి ఉగాది పండుగ శుభ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. కొత్తకుండలో నవధాన్యాలను వెన్నతో వండి భారీ ప్రదర్శనగా వెళ్లి గ్రామదేవత మారెమ్మ తల్లికి భక్తిప్రపత్తులతో భోణం సమర్పించారు. గ్రామంలోని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, మతసామరస్యం, సోదరభావం, వెల్లి విరియాలన్న సదుద్దేశంతో అమ్మవారికి బోనాలు సమర్పించినట్లు సల్లెపల్లె లావణ్య రెడ్డి పేర్కొన్నారు.బంధుమిత్రులు కుటుంబ సభ్యులు శిరివెళ్ల ప్రజలతో పాటు పలు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రదర్శనగా వెళ్లి కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమై విరాజిల్లుతున్న చల్లని తల్లి మారెమ్మకు జాతర తిరుణాల పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటారు.

బోనం తీసుకెళ్తున్న సల్లేపల్లె లావణ్యరెడ్డి

అవుకు : ఉగాది పర్వదినం సందర్భంగా గ్రామ దేవతలైన మూలమ్మ, పెద్దమ్మ, సుంకులమ్మ, కుంటమ్మ, ఎల్లమ్మ అమ్మవార్లకు మహిళలు బోనాలను గురువారం సమర్పించారు. అవుకు పట్టణంలోని చల్లా చిన్నపరెడ్డి కాలనీకి చెందిన మహిళలు మెట్టుపల్లి రోడ్డులో ఉన్న మూలమ్మ తల్లికి మేళ తాళాల నడుమ బోనాలను సమర్పించారు.

స్టేషన్‌కు చేరిన 'పది' ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి - గడివేముల

ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షాలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలను విద్యాశాఖ అధికారులు గడివేములలోని స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం భద్రపర్చారు. పరీక్ష చీఫ్ సూపర్డెంట్ శైలజ, ఎస్ఎస్‌సి డిపార్ట్మెంటల్ ఆఫీసర్ అన్వర్ హుస్సేన్ భద్రతా సిబ్బంది తో జిల్లా పరిషత్ పాఠశాల చీఫ్ సూపర్డెంట్ ప్రతాప్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ సుంకన్నలు కలిసి పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నా పత్రాలను సబ్జెక్టుల వారీగా భద్రపరిచి వాటికి సీల్ వేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ రామకృష్ణుడు మాట్లాడుతూ రెండు సెట్ల చొప్పున పరీక్షా పత్రాలు వచ్చాయన్నారు. మండలంలో రెండు సెంటర్లలో విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాస్తున్నా రన్నారు. మోడల్ స్కూల్ సెంటర్లో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే పరీక్షల్లో ప్రశ్న పత్రాలను స్టేషన్‌లో భద్రంగా ఉంచామన్నారు. పరీక్షల సమయంలో వాటిని బయటకు తీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బిటి వెంకటసుబ్బయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

తల్లుల పాదాలను కడుతున్న విద్యార్థులు

ఉత్తమ ఫలితాలు సాధించండి

- సుమేధా హైస్కూల్‌లో 'అమ్మకు వందనం'

ప్రజాశక్తి - బేతంచెర్ల

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆకాంక్షలు నెరవేర్చాలని సుమేధా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ డైరెక్టర్లు విజయ నాగరాజు, శ్రీధర్ రెడ్డి, గుండా గోపాల్, విద్యార్థులకు సూచించారు. గురువారం బేతంచెర్ల పట్టణంలోని సుమేధ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆవరణంలో సరస్వతి మాతకు పూజలు చేసి 'అమ్మకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లుల పాదాలను కడిగి ఆశీర్వాదం పొందారు.

మూల పెద్దమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి - గడివేముల

మండల కేంద్రమైన గడివేములలో మూల పెద్దమ్మ దేవాలయం జాతర ఉత్సవాలు గురువారం నుంచి మొదలయ్యాయి. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని ముడుపులు చెల్లించారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఘటానికి పోయే కార్యక్రమం, బోనాల కుండలతో అమ్మవారి దర్శనం ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్సై బీటీ వెంకటసుబ్బయ్య, గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పాతపాడు గ్రామంలోని శ్రీ ఉమామహేశ్వర హైస్కూల్‌లో 2008-2009 విద్యా సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి గురువులు పాఠశాల కరస్పాండెంట్ కొండారెడ్డి, హెచ్ఎం నాగముణి రెడ్డి, అప్పటి ఉపాధ్యాయులు రామకృష్ణ, రామ్మోహన్ రెడ్డి, గొల్ల కుమారస్వామి, రాజా హుస్సేన్, బాలచంద్రుడు, సుబ్బారావు, సుంకన్న, శివనాగిరెడ్డి, వెంకట శివుడులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్, హెచ్ఎం కొండారెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు 10వ తరగతి తర్వాత వారి అభిరుచులకు అనుకూలంగా కోర్సులను తీసుకుని మంచి ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. సంపాదన ఎంత ముఖ్యమో ఇతరులకు సహాయం అందించడం అంతే ముఖ్యమన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేసిన విద్యార్థి రాఘవ గౌడ్ మాట్లాడుతూ మా ఉపాధ్యాయులను స్మరించుకుంటూ సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు కాశీం, మద్దిలేటి స్వామి, అమర్, గాది లింగ, దాదా పీరా, నాగరాజు, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో నిర్దేశించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్కూల్ ఎడ్యుకేషన్, మహిళా-శిశు సంక్షేమ ప్రభుత్వ పథకాలు, విలేజ్, వార్డు సెక్రటేరియట్, స్పందన గ్రీవెన్స్, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నంద్యాల జిల్లా కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతి. టి. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా ఎనీమియా నివారణా చర్యలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లలపై ఐసిడిఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మన బడి నాడు నేడు క్రింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని పటిష్టంగా అమలు పరచాలన్నారు. జగనన్న కాలనీలలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్ అధికారులతో మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఐదేళ్ల లోపు వున్న చిన్నారులు, కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణుల్లో రక్త హీనత, పోషకాహార లోపం వున్న వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇతర అధికారులు

రాష్ట్ర స్థాయి బండలాగు పోటీల్లో విజేతగా పంచాలింగాల వృషభాలు

ప్రజాశక్తి - పగిడ్యాల

ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగు పోటీల్లో పంచాలింగాల వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. వైసిపి నాయకుడు నాగభూషి గౌడు ఆధ్వర్యంలో బండలాగు పోటీలను నందిట్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బని, లక్ష్మాపురం గ్రామస్తులు షమిన్ (సిఎం)లు బుధవారం ప్రారంభించారు. ఈ పోటీలలో పంచాలింగాల గ్రామానికి చెందిన బైరపోగు వృషబాలు 4250 అడుగులు బండలాగి మొదటి స్థానంలో నిలిచాయి. గుట్టపాడు గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి, పి రుద్రవరం గ్రామానికి చెందిన యల్లాగౌడు వృషబాలు 4127.8 అడుగులు బండ లాగి రెండవ స్థానంలో, ప్రకాశం జిల్లా నాగులపాడు గ్రామానికి చెందిన పుల్లకాయల శేషాద్రి చౌదరి వృషబాలు 4052 అడుగులు లాగి మూడవ స్థానంలో, రంగాపురం గ్రామానికి చెందిన చిన్నారెడ్డి వృషబాలు 3864 అడుగులు లాగి నాలుగోవ స్థానంలో, ఎ కోడురు గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి వృషబాలు 3809 అడుగులు బండలాగి ఐదవ స్థానంలో నిలిచాయి. మల్యాల గ్రామానికి చెందిన మైమున్నా వృషబాలు 3716 అడుగులు బండలాగి ఆరోవ స్థానంలో నిలవగా, బల్లవరం గ్రామానికి చెందిన శివ వృషబాలు 3274.3 అడుగులు బండలాగి ఏడవ స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ 30 వేలు, రెండవ బహుమతి రూ 20 వేలు, మూడవ బహుమతి రూ 15 వేలు, నాలుగోవ బహుమతి రూ 10 వేలు, ఐదవ బహుమతి రూ 8 వేలు, ఆరోవ బహుమతి రూ 5వేలు, ఏడవ బహుమతి రూ 4 వేలు గెల్పుందిన వృషబాలకు బహుమతులు ప్రదానం చేశారు.

బండలాగు పోటీలను ప్రారంభిస్తున్న గ్రామస్తులు షమిన్(సిఎం)

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

రుద్రవరం : గర్భిణీ బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడి టీచర్లు

ప్రజాశక్తి - రుద్రవరం

అత్యధిక పోషక విలువలు గల చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండవచ్చని అంగన్వాడి టీచర్లు తిరుపాలమ్మ, రామేశ్వరి, జయమ్మ తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవం పురస్కరించుకుని పోషన్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా కొండమాయపల్లి, ఆర్ కొత్తూరు, వెలగలపల్లి అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో గురువారం కొండమాయ పల్లెలోని అంగనవాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సహకారంతో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడి ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులకు, బాలింతలకు చిరుధాన్యాలను ప్రదర్శించి వాటి ఉపయోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పావని, హెల్త్ అసిస్టెంట్ సంధ్యారాణి, ఆశ కార్యకర్త మల్లేశ్వరి, గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ** : అధిక పోషక విలువలు గల చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం పదిలంగా ఉంటుందని అంగన్వాడీ టీచర్లు శైలజ, గుల్జార్, జకీర, మరియమ్మ, చెన్నమ్మ, మమత, లక్ష్మి కుమారి, గౌసియా, మాధవిలు తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవము పురస్కరించుకుని పౌష్టికాహార పక్షోత్సవాల (పోషన్ పక్వాడ్) సందర్భంగా కార్యక్రమం గురువారం నిర్వహించారు. సూపర్వైజర్ అనురాధ ఆదేశాల మేరకు గర్భవతులు, బాలింతలతో పాటు ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు చిన్నారుల తల్లిదండ్రులను పిలిపించి వారికి చిరుధాన్యాల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్** : చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ్ కుమారి, నాగేశ్వరమ్మలు అన్నారు. గురువారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఆత్మకురు మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తమతమ కేంద్రాల పరిధిలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు చిరుధాన్యాల వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉంటాయన్న విషయాలను వారు వివరించారు.

ఆళ్లగడ్డ : గర్భిణీ, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడి టీచర్లు

ముగిసిన ఉగాది ఉత్సవాలు

- గ్రామోత్సవంలో ఇఒ,అర్చకులు
- వెండి పడగ వితరణ

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కొత్తూరు సుబ్బారాయుడు స్వామి సన్నిధిలో ఉగాది ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకులు పుల్లయ్య స్వామి, వీరయ్య స్వామిలను 10,116 రూపాయలతో, శాలువాలతో సత్కరించారు. నంద్యాలలోని అనకల పేటకు చెందిన జయ సుబ్బుడు కుమారుడు నాగార్జున స్వామి ఒక కేజీ వంద గ్రాముల వెండి నాగ పడిగను వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామకృష్ణ, సిబ్బంది సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, అర్చకులు వీరయ్య స్వామి, నారయణ స్వామి శర్మ, సురేష్ శర్మ, కిట్టయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన సర్పంచి

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండలంలోని నల్లమల అటవీ సమీప గ్రామం మహదేవపురం గ్రామ సర్పంచి పెద్ది రమణయ్య అనాథ మృతదేహం అంత్యక్రియలకు ఆర్థికసాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మహదేవపురం గ్రామంలోని దస్తగిరి స్వామి దర్గా ఆవరణంలో గుర్తు తెలియని సాధువు మృతి చెందడంతో వెంటనే సర్పంచి స్పందించి అంత్యక్రియలు చేసేందుకు ముందుకు వచ్చారు. పంచాయతీ అధికారి, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో గురువారం హోరాహోరీగా ఎద్దుల బండలాగుడు పోటీలు జరిగాయి. పోలేరమ్మ తిరుణాల సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలలో నంద్యాల, కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాలకు చెందిన 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలలో 5 జతలు ఎద్దులు విజేతలుగా నిలవడంతో వాటికి నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. అలాగే సీనియర్ కేటగిరి విభాగంలో శుక్రవారం ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. తిరుణాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రంజాన్ ఉపవాస దీక్షలతో శాంతి సామరస్యం వెల్లివిరియాలి

- జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నాయక్ దిల్షాద్ ముజఫర్ హుస్సేన్

ప్రజాశక్తి - శిరివెళ్ల

రంజాన్ ఉపవాస దీక్షలతో శాంతి సామరస్య వెల్లివిరియాలని కర్నూలు ఉమ్మడి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నాయక్ దిల్షాద్ ముజఫర్ హుసేన్ ఆకాంక్షించారు. గురువారం శిరివెళ్లలోని వైసిపి కార్యాలయంలో ఆయన రంజాన్ మాసం క్యాలెండర్‌ను ఆవిష్కరించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు సేవ చేసేలా ప్రజల్లో స్ఫూర్తిని కలిగించాలని, సాటి మనిషి పట్ల ప్రేమ, దయ, కరుణ మానవత్వం కలిగి ఉండాలన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం పెంపొందాలన్నారు.

మత సామరస్యానికి ప్రతీకగా, స్నేహనికి, సోదరబావానికి నిదర్శనంగా ప్రతి ఏటా వెల్లివిరుస్తున్న శాంతి సామరస్యాలు ఈ ఏడాది కూడా కొనసాగేలా నియమ నిష్ఠలతో ఉపవాస దీక్షలు చేస్తూ ముస్లింలు ప్రార్థనలు చేయాలని కోరారు.

నాన్న ఆశయాలను నెరవేరుస్తా

- చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - అవుకు

'మా చిన్నాన్న ఎంపిపి చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా భాస్కర్ రెడ్డి, చల్లా అమర్నాథ్ రెడ్డిల సహకారంతో మా నాన్నగారి ఆశయాలను నెర వేరుస్తా' అనిదివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి కుమారుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి పేర్కొ న్నారు. దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి కుమారుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి బుధవారం వైసిపి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. మొదట దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృషారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి నుండి రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటానని, ప్రతి కార్యకర్తకు అండగా ఉండి తనవం తు సహాయ సహకారాలను అందిస్తానని తెలిపారు. త్వరలోనే నియోజక వర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి వైసిపి నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో చల్లా రాజ శేఖర్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.

హౌసింగ్ ఇంచార్జి ఎఇగా శేఖర్ బాధ్యతలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల హౌసింగ్ ఎఇగా బుగ్గాలపల్లి గ్రామ సచివాలయం అసిస్టెంట్ శేఖర్‌కు సంబంధిత అధికారులు బాధ్యతలు అప్పజెప్పారు. ప్రస్తుతం హౌసింగ్ ఏఈగా ఉన్న కృష్ణారెడ్డి అవుకు మండలానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో శేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఏఈ శేఖర్ మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అందరి సహకారంతో లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

దళితుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - శ్రీశైలం

మండలంలోని మునగాల గ్రామంలో నరహరి అనే దళితుడిపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశాయి. ఉగాది పండుగ సందర్భంగా గుడికి వెళ్లిన దళితుడిపై దాడి చేసి కొట్టడం అమానుషమని అన్నారు. దాడి చేసిన వారిలో హెడ్ కానిస్టేబుల్ ఉన్నాడని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మనస్థాపానికి గురైన నరహరి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారన్నారు. నరహరికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. దాడులపై జిల్లా ఎస్పీ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

ప్రజాశక్తి - మహానంది

కుంటలో ఈతకు వెళ్లిన విద్యార్థి చుట్ల విజయ్ (13) బురదలో ఇరుక్కుపోయి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. మహానందిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు 8వ తరగతి చదువుతున్న విద్యార్థి చుట్ల విజయ్(13) ఉదయం పాఠశాలకు వెళ్లాడు. మధ్యాహ్నం తర్వాత పిల్లలతో పాటు గ్రామంలోని ఇండ్లకు అతి సమీపంలో ఉన్న కుంటకు వద్దకు తోటి స్నేహితులతో ఈతకి వెళ్లారు. కుంటలో నీరు, లోతుగా ఉండటం వలన ఈతకు వెళ్లిన విద్యార్థులు కొంతమంది బయటికి రాగా చుట్ల విజయ్ మాత్రం కుంట మట్టిలో ఇరుక్కుపోయి రాలేకపోయాడు. తోటి విద్యార్థులు వెంటనే గ్రామస్తులకు విషయాన్ని తెలియజేశారు. గ్రామస్తులు కుంటలో గాలించగా చెట్ల విజయ్‌ను బయటికి తీయగా అప్పటికే మృతి చెందడంతో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

విద్యార్థులు భయం వీడి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా రాయాలని ఎంఇఓ సుభాన్ అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడారు. ఏ విషయమైనా సరే భయాన్ని వీడినప్పుడే విజయం సాధించే అవకాశం పుష్కలంగా ఉంటుందన్నారు. మెలకువులు పాటించి పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట రమణమ్మ, వైస్ ప్రిన్సిపాల్ వరప్రసాద్ విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు. కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఎంపీడీవో వెంకటరమణ, తహశీల్దార్ భారతి, ఈఓఆర్‌డి పుల్లయ్య, ఎంఈఓ సుభాన్ అవగాహన కల్పించి పరీక్షలు ధైర్యంగా ఎలా రాయాలో సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ జేరిన ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఇఓ సుభాన్

మహారాజ శ్రీ డోన్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.P.No.8/2023

కమ్మరి బ్రహ్మయ్య ఆచారి, వయస్సు 38 సం॥,లు
S/o కమ్మరి రంగస్వామి ఆచారి, ఇంటి నెం.24-169-25,
కొండపేట, డోన్ టౌన్, డోన్ మండలం, నంద్యాల జిల్లా.

...పిటీషనర్/అర్జీదారు

-Vs-

1) అలంకొండ జయరాముడు, వయస్సు 50 సం॥లు, S/o ఎ.సంజన్న, హిందూ, వాప్యారము, ఇంటి నెంబర్ 4-149-31-13-6-15, శ్రీరామ్‌నగర్, పిండి మిషన్ ఎదురుగా, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.
2) గంగిరెడ్డి గారి విశ్వనాథ రెడ్డి, వయస్సు 48 సం॥లు, S/o జి.గంగిరెడ్డి, హిందూ, వ్యవసాయం, ఇంటి నెంబర్ 2-62, దేవరబండ గ్రామము, డోన్ మండలం, నంద్యాల జిల్లా.
3) తవిశల ఈశ్వర రెడ్డి, వయస్సు 50 సం॥లు, S/o లక్ష్మిరెడ్డి, హిందూ, ఇంటి నెంబర్ 21వ వార్డు 18 వెల్డింగ్ పని, కొండపేట, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.
4) నేస రాజేశ్వరి, వయస్సు 42 సం॥లు, గృహిణి, హిందూ, W/o రామకృష్ణ, ఇంటి నెంబర్ 23-20-1-1, కొండపేట, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.
5) కమ్మరి రంగయ్య ఆచారి, వయస్సు 60 సం॥లు, S/o సుంకన్న ఆచారి, హిందూ, కొలిమి పని, ఇంటి నెంబర్ 8-109-5-13, శ్రీనివాసనగర్, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.
6) సత్యమయ్య, S/o Not Known, వయస్సు 75 సం॥లు, హిందూ, హోటల్ లక్ష్మి వెంకటేశ్వర, కె.వి.ఎస్. కాలనీ, ఇంటి నెంబరు 9-42-27, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.
7) రాజ మధుబాల W/o ప్రవీణ్ కుమార్, వయస్సు 35 సం॥లు, హిందూ, వ్యాపారము, ఇంటి నెంబర్ 4-149-30-2, టీచర్స్ కాలనీ, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.
8) చిన్న స్వామి S/o చిన్నమద్దయ్య, వయస్సు 38 సం॥లు, హిందూ, వ్యాపారము, పీర్ల చావిడి ఎదురుగా, ఇంటి నెంబర్ 1-262, వెంకటనాయనిపల్లి గ్రామము, డోన్ మండలం, నంద్యాల జిల్లా.
9) అలేబాదుపరమేష్ S/o Not Known, వయస్సు 42 సం॥లు, హిందూ, వ్యవసాయం, ఇంటి నెంబర్ 8-86-21-6, కె.ఈ.మాదన్న నగర్, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.
10) పి.చంద్రశేఖర్ రెడ్డి S/o పి.వెంకటేశ్వర రెడ్డి, వయస్సు 42 సం॥లు, హిందూ, వ్యవసాయం, ఇంటి నెంబర్ 1-1088, కొత్తకోట గ్రామం, డోన్ మండలం, నంద్యాల జిల్లా.
11) భాస్కర్ S/o ఆదిత్యమయ్య, వయస్సు 42 సం॥లు, హిందూ, కిరాణం షాపు, ఇంటి నెంబర్ 25-12-3, శేగులాడ్జీవీధి, కొండపేట, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.
12) ఆదిత్యమయ్య S/o Not Known, వయస్సు 70 సం॥లు, హిందూ, వడ్డీ వ్యాపారము, ఇంటి నెంబర్ 15-85, అమ్మవారిశాల గుడి వెనుక, పాతపేట, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.
13) గడ్డం దేవేంద్ర రెడ్డి S/o హనుమంత రెడ్డి, వయస్సు 42 సం॥లు, హిందూ, ఇంటి నెంబర్ 4-149-32-12-21, శ్రీరామ్‌నగర్, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.
14) నీలి తిరుపతి S/o వెంకట సుబ్బయ్య, వయస్సు 48సం॥లు, హిందూ, ఎంప్లాయి, ఇంటి నెంబర్ 3-118-1, యూనియన్ బ్యాంక్, యస్.టి.అన్నస్ స్కూల్ ఎదురుగా, బేతంచెర్ల టౌన్, నంద్యాల జిల్లా.
15) కటారుకొండ హరి S/o లేట్ పెద్ద సుబ్బన్న, వయస్సు 48సం॥లు, హిందూ, వ్యాపారం, ఇంటి నెంబర్ 11-82, వినాయకవీది, కొత్తపేట, డోన్ టౌన్, నంద్యాల జిల్లా.
16) పెనుగొండ సుంకన్న S/o పి.బుడ్డన్న వయస్సు 48 సం॥లు, హిందూ, వ్యవసాయం, ఇంటి నెంబరు 2-41, రేకులకుంట గ్రామం, R/o దేవరబండ, డోన్ మండలం, నంద్యాల జిల్లా.

...రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా ప్రస్తుతం నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం & డోన్ మండల ప్రజలకు తెలియజేయడమేమనగా పై నెంబర్ ఐ.పి.లో అర్జిదారుడు కమ్మరి బ్రహ్మయ్య ఆచారి తండ్రి కమ్మరి రంగస్వామి ఆచారి ఇంటి నెంబరు 24-169-25 డోన్ గ్రామం, డోన్ మండలం తనను దివాళా దారుగా తీర్మానం చేయమని కోరుతూ పై కోర్టులో అర్జీదాఖలు చేసినాడు ఇందుపైన ఎవరికైన ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 27-04-2023వ తేదిన ఉదయం 10-30గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

కోట్ల సత్యనారాయణ రెడ్డి, బికాం., యల్ .యల్.బి
కోట్ల రవీంద్రనాథ రెడ్డి, బి.ఎ., యల్ .యల్.బి
అర్జీదారు పరం న్యాయవాదులు,
డోను - 518222, నంద్యాల జిల్లా.
సెల్ : 9030288570

భగత్‌సింగ్ ఆశయ సాధనకు పోరాడాలి

(5వ పేజీ తరువాయి..) సందర్భంగా స్థానిక గాంధీ చౌక్ సెంటర్లో భగత్ సింగ్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి వెంకట లింగం అధ్యక్షత వహించారు. ప్రతి యువకుడు భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని చైతన్యం కావాలని చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు జైలాన్, నాయకులు సుబ్బారావు, రానా, నరసింహ, ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు. **నంద్యాల అర్బన్** : నంద్యాల పట్టణంలోని భగత్ సింగ్ గ్రంథాలయం దగ్గర భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా గురువారం వారి విగ్రహాలకు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి శివ, నాయకులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు వినీత్, సంజయ్, దివాకర్, రమణ, శ్రీరాములు, హర్ష, రాజశేఖర్, గోపాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఎస్‌సి కాలేజీ బాయ్స్ హాస్టల్‌లో నివాళ్లులర్పించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, జిల్లా సహాయ కార్యదర్శి పి.ఎర్రిస్వామి, ఎఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ** : సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై యువత ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రైవేట్ పాఠశాలల నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ బాషా అన్నారు. పట్టణంలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో కరస్పాండెంట్ శివకుమార్,ఉపాధ్యాయ బృందం విద్యార్థులతో కలిసి భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. **పాణ్యం:** భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల పోరాట స్ఫూర్తితో భారతదేశంలో కార్పొరేటీకరణ, మతోన్మాదానికి వ్యతిరేకంగా మరో స్వాతంత్ర పోరాటం చేద్దామని సిఐటియు మండల కార్యదర్శి కె.భాస్కర్, విద్యార్థి సంఘం నాయకులు బత్తిని ప్రతాప్‌లు పేర్కొన్నారు. సిఐటియు కార్యాలయంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. రమేష్, సంతోష్, గోవిందు, మాభాష, భోపాల్, రామచంద్రుడు, మాసుం, ఆటో, హమాలీ కార్మికులు పాల్గొన్నారు. **ఆత్మకూరు** : దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారితో పోరాడి అతి చిన్న వయసులోనే ఉరి కంభంను ముద్దాడి ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురుల ఆశయాలను కొనసాగింద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు పేర్కొన్నారు. గురువారం నాడు పి ఫకీర్ సాహెబ్ అధ్యక్షతన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతి సభ నందికొట్కూరు సిపిఎం కార్యాలయం దగ్గర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు, సిపిఎం నాయకులు కే భాస్కర్ రెడ్డి, పి వెంకటేశ్వర్లు మాట్లాడారు. దేశానికి స్వతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల అవుతున్న దేశంలో పేదరికం, ఆకలి చావులు, ఆత్మహత్యలు, నిరుద్యోగం మరింత పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు గోపాలకృష్ణ, రామ్ రెడ్డి, సోడా బిబి, నరసింహులు, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

- అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్‌లు అన్నారు. గురువారం భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురుల 92వ వర్ధంతి సంద ర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర వారి చిత్రపటాలకి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని అర్బన్ కాలనీలో 21వ వార్డు కౌన్సిలర్ బోయ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో స్థానిక భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని కొత్త రామాపురం గ్రామంలో సిపిఎం మండల కార్యదర్శి నరసింహ నాయక్, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు రామ్ నాయక్, ఇస్మాయిల్, మా బాష, గణపతి, శివకుమార్, శివుడు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువతి, యువకులు భగత్ సింగ్, సుగుదేవ్, రాజ్ గురు ఆశయ సాధనకు పోరాటం చేయాలని ఎస్ఎఫ్ఐ ఆత్మకూర్ మండల కార్యదర్శి కే దినేష్ కుమార్, మాజీ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఏ రణధీర్, డి రామ్ నాయక్ అన్నారు. పట్టణంలోని సుదర్శన వర్మ కార్యాలయం నుండి గౌడ్ సెంటర్ కొత్త బస్టాండ్ మీదగా కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాయకులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు : మండలంలోని సున్నిపెంట గ్రామంలో స్థానిక రింగ్ పార్క్ సెంటర్ నందు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిన్న మారెన్న, మండల నాయకులు నాగ సైదయ్య, సిఐటియు శ్రీశైలం మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్స్, కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ శ్రీశైలం మండలం అధ్యక్షులు ఏ.రాము, దాసు, జెడ్డా. నాగరాజు,లక్ష్మయ్య, శ్రీను ఓంకార్,నాగరాజు, చిన్న వ్యాపారస్తుల సంఘం ట్రెజరర్ జోసఫ్,ఉపాధ్యక్షులు ఎస్కే ఖలీల్ ఇతరులు పాల్గొన్నారు. **పాములపాడు** : సిపిఎం మండల కార్యదర్శి సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఆవాజ్ కమిటీ నాయకులు సోడా బాష, వ్యకాసం నాయకులు ఏసేపు, మైనార్టీ సంఘం నాయకులు షర్ఫుద్దీన్ అలీలు భగత్ సింగ్ చిత్ర పటానికి నివాళులర్పించారు. **బండి ఆత్మకూర్** : మండల కేంద్రంలో భగత్ సింగ్, రాజు గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతినిసిఐటియు నాయకులు రత్నమయ్య డివైఎఫ్ఐ నాయకులు రాజేష్ కార్మిక సంఘం కార్యదర్శి డేవిడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల** : మండల కేంద్రంలోని సిపిఎంకార్యాలయం నందు మండల కార్యదర్శి ఆర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో సిపిఎం సీనియర్ నాయకులు వై ఎల్లయ్య, బేతంచర్ల పట్టణ కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశ ప్రజల ప్రయోజనాల కోసం పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎస్ సాధిక్ హుస్సేన్, బాలయ్య, రామాంజనేయులు, మద్దిలేటి స్వామి, శ్రీనివాసులు, రామ చంద్రుడు, రామకృష్ణ, రాజబాబు, వెంకటరమణ, చిన్న వెంకటేశ్వర్లు, నరసింహ, అంకాలు, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల కలెక్టరేట్ : భగత్ సింగ్ చిత్రపటానికి వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఆత్మకూరు: కాగడాల ప్రదర్శన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నంద్యాల కలెక్టరేట్ : భగత్ సింగ్ చిత్రపటానికి వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

శ్రీశైలం ప్రాజెక్ట్ : భగత్ సింగ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

పాములపాడులో..